మరిన్ని కథనాల
కోసం
యూట్యూబ్‌లో
ప్రసారమవుతున్న
మీ
SREECHAKRA
NewsTVని
వీక్షించవచ్చు.
ప్లీజ్, సబ్‌స్క్రైబ్, లైక్,

https://www.sreechakranews.com
శ్రీచక్ర
SREECHAKRA TELUGU DAILY

విలేకరులు కావలెను
శ్రీచక్ర
ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాల్లోని
అన్ని జిల్లాలు, తాలుకా, మండలాల్లో శ్రీ చక్ర తెలుగు దినపత్రికలో
SREECHAKRA NewsTV ల్లో వార్తల సేకరణకు విలేకరులు కావలెను.
జర్నలిస్టుగా రాణించాలనుకునేవారికి అవకాశం..
ఆసక్తి గల వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.
మీ..
డాక్టర్ హరినాథరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్
9848334101
8333000509

సంపుటి 10 | సంచిక 109 | కర్నూలు | మంగళవారం 13 మే 2025
పేజీలు : 08 | వెల రూ. 5.00
Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi

# అణ్వస్త్రాల బూచికి బెదరం: మోదీ



న్యూఢిల్లీ(శ్రీచక్ర) : పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా ఇంత పెద్దఎత్తున భారత్ ప్రతిస్పందిస్తుందని టెర్రరిస్టులు సైతం ఊహించలేదని, మన క్షిపణలు, డ్రోన్లు పాక్ ఉగ్రశిబిరాల బీషణంగా గర్జించడంతో టెర్రరిస్టు స్థావరాలు నేలమట్టమయ్యాయని అన్నారు. పాకిస్తాన్ డ్రోన్లను కుప్పలుతెప్పలుగా కూల్చేయడం ద్వారా భారత్ మిలటరీ పవర్ ఏమిటో యావత్ ప్రపంచం చూసిందన్నారు. 'ఆపరేషన్ సింధూర్' సింధూర్ విజయాన్ని ఈ దేశ మహిళలకు అంకితమిస్తున్నామని అన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి జాతిని ఉద్దేశించి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉత్తేజపూర్వక ప్రసంగం చేశారు.ఆపరేషన్ సిందూర్‌లో బలగాలు ఎంతో ధైర్యం ప్రదర్శించాయని, మన సైన్యం తెగువకు, శాస్త్రవేత్తలకు సెల్యూట్ చేస్తున్నానని మోదీ అన్నారు. పాక్ డ్రోన్లను గాలిలోనే సైన్యం కూల్చేసిందని, టెర్రరిస్టులను సమూలంగా మట్టుపెట్టేందుకు సైన్యానికి సంపూర్ణ స్వేచ్ఛను ఇచ్చామని చెప్పారు. "మన ఆడకూతుళ్ల నుదుట సిందూరం తుడిచిపెట్టిన వారు ఎలాంటి ఫలితాన్ని అనుభవించాల్సి వస్తోంది ప్రతీ టెర్రరిస్టు, టెర్రరిస్టు సంస్థకు తెలిసొచ్చింది" అని అన్నారు.ఆపరేషన్ సిందూర్ కేవలం పేరు కాదు, 140 కోట్ల భారతీయుల భావోద్వేగాలకు ప్రతీక అని అన్నారు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదంపై గట్టి హెచ్చరిక చేశారు. అణ్వస్త్రాల బ్లాక్‌మెయిల్‌ను ఇండియా సహించేది లేదని, ఉగ్రవాదం, పాక్ ఆక్రమిత ఆక్రమిత కశ్మీర్‌పైనే పాక్‌తో చర్చలుంటాయని మోదీ స్పష్టం చేశారు.

# నర్సుల సేవలు అనన్య సామాన్యం

## రోగుల పాలిట వారు మాతృమూర్తులు
## పలువరు నర్సులను సత్కరించిన పవన్ కళ్యాణ్



గుంటూరు,మే12(శ్రీచక్ర) : వైద్యరంగంలో నర్సులు అందిస్తున్న సేవలు అనన్య సామాన్యమని డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ కొనియాడారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ స్ఫూర్తితో.. రోగులకు స్వస్థత కలిగేలా వృత్తికి గౌరవాన్ని తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. నిస్వార్థంగా వారు అందించే సేవలు వెలకట్టలేనివన్నారు. నర్సుల చేతి స్పర్శ కూడా రోగిలో మానసిక స్థయిర్యంతో పాటు సాంత్వన కలిగిస్తుందని తెలిపారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పిఠాపురం నియోజక వర్గం పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న స్టాఫ్ నర్సులతో ఆయన సమావేశం అయ్యారు. ఉత్తమ సేవలు అందించిన ఎనిమిది మందిని సత్కరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నిస్వార్దంగా నర్సులు అందించే సేవలు వెలకట్టలేనివని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. విధి నిర్వహణలో ఎంతోమంది రోగుల ప్రాణాలు కాపాడుతున్న నర్సుల సేవలను ఎవరూ మరిచిపోరని ఆయన ప్రశంసించారు. విధి నిర్వహణలో ఎంతో మంది రోగుల ప్రాణాలు కాపాడుతున్న నర్సుల సేవలను ఎవరూ మరచిపోరు. మీరు పడే శ్రమ, కష్టం నాకు తెలుసు. కొవిడ్ సమయంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వర్తించిన విధానం మరువలేం. ఇటీవల సింగపూర్‌లో నా కుమారుడు మార్క్ శంకర్ ప్రమాదానికి గురై ఆసుపత్రిలో ఉన్న సమయంలో అక్కడ నర్సులు చేసిన సేవలు చూసినప్పుడు మరోసారి మీ కష్టం గుర్తుకువచ్చింది. మిమ్మల్ని కలసి మీరు అందించే సేవలు మరచిపోలేనివి అని చెప్పి కృతజ్ఞతలు చెప్పాలనుకున్నాను. అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలిసే అవకాశం రావడం ఆనందాన్నిచ్చింది. నా దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. ఇదిలావుంటే అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ఏపీ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. నర్సుల వృత్తికి గౌరవాన్ని, ఖ్యాతిని తెచ్చిన ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతిని పురస్కరించుకొని అంతర్జాతీయ నర్సుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల ఆరోగ్య సంరక్షణలో నర్సుల కృషి, సేవ అమోఘమని కొనియాడారు. పేషంట్లను సొంత మనిషిలా చూసుకుంటూ.. అవసరమైన చికిత్సలో ఆసరాగా నిలుస్తున్న నర్సులు.. చిరునవ్వుతో, మానవత్వంతో సేవలందించే ప్రతి నర్సుకీ హృదయపూర్వక వందనాలు అని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.


# ప్రతి జిల్లాలో ఒక దేవాదాయ శాఖ కార్యాలయం-మంత్రి ఆనం



ఒంగోలు,ఒంగోలులో దేవాదాయ శాఖకి సంబంధించిన అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయాన్ని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రారంభించారు. కార్యాలయం ప్రారంభోత్సవం అనంతరం మంత్రి ఆనం మాట్లాడుతూ ఒంగోలు నగరంలో దేవాదాయ శాఖకు సంబంధించినటువంటి జిల్లా దేవాదాయ శాఖ అధికారి నూతన భవనాన్ని నేడు ప్రారంభించడం జరిగింది. దాదాపు కోటి రూపాయల ఖర్చుతో భవన నిర్మాణం చేయడం జరిగింది . ప్రతి జిల్లాలో ఒక దేవాదాయ శాఖ కార్యాలయం ప్రారంభం చేయాలి అనేది కూటమి ప్రభుత్వం యొక్క నిర్ణయం. దేవాదాయ శాఖకు సంబంధించి సొంత భవనం ప్రతి జిల్లాలో ఉండాలి అనేది చంద్రబాబు నాయుడు నిర్ణయం. ఈ మధ్యలోనే నెల్లూరులో ఒక కార్యాలయం ప్రారంభించడం జరిగింది. త్వరలో తిరుపతి జిల్లాలో రీజనల్ జాయింట్ కమిషనర్ కార్యాలయం మరియు అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం కూడా ప్రారంభం జరగబోతుంది. మా కూటమి ప్రభుత్వం వచ్చిన పది మాసాలలో దేవాదాయ శాఖకు సంబంధించి ఎన్నికల హామీల్లో ప్రకటించిన దాదాపు హామీలు నెరవేర్చడం జరిగింది. ధూప దీప నైవేద్యాల కింద గత ప్రభుత్వ హయాంలో 5000 ఉంటే నెలకు మా కూటమి ప్రభుత్వంలో దాదాపు 5,600 దేవాలయాలకు నెలకు పదివేల రూపాయలు ఇవ్వడం జరుగుతుంది. మరొక 300ఆలయాలకు ప్రతిపాదనలకు వచ్చాయి వాటికి కూడా పరిశీలిస్తున్నాం. సిజిఎఫ్ పథకం కింద ఆలయాల పునరుద్ధరణ కొరకు నిధులు మంజూర ప్రక్రియ కూడా కొనసాగుతుంది. రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ నియోజకవర్గాలు, శాసనసభ నియోజకవర్గాల నుంచి వచ్చినటువంటి వినతులను క్షుణ్ణంగా పరిశీలించి ఆలయాల అభివృద్ధికి, ధూప దీప నైవేద్యాలకు నిధులు మంజూరు ప్రక్రియ వేగవంతం చేయలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. ప్రాంతాలవారీగా మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్ ను పరిగణలోకి తీసుకొని నిధులు మంజూరు చేయడం జరుగుతుంది. ప్రతి సంవత్సరం దాదాపు 100 కోట్ల రూపాయలు ఆలయాల నిర్మాణం కోసం పునరుద్ధరణ కోసం కేటాయించడం జరుగుతుంది. వేద పండితులకు ఎన్నికల హామీల్లో ప్రకటించినట్లుగా సంభవన కింద ఒక్కొక్కరికి 3000 రూపాయలు క్రింద మూడు సంవత్సరాలు పాటు ఇచ్చేందుకు ప్రభుత్వం చొరవ తీసుకుంది ఆ ప్రక్రియ గత నెలలోనే ప్రారంభమైందని అన్నారు. ఆలయాల్లో ఉన్న అర్చకులకు 15వేల రూపాయలు, ఆలయాల్లో పనిచేసే నాయి బ్రాహ్మణులకు 20వేల రూపాయలు ఇచ్చేందుకు ఇప్పటికే మార్గదర్శకాలు జారీ చేశాం. రాష్ట్రంలో ప్రధాన దేవాలయాలలో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. ? దేవాదాయ శాఖలో ప్రక్షాళన ప్రారంభమైంది.

# సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, మరమ్మతులకు ప్రాధాన్యం

### 344కోట్లతో తోణం టెండర్ల పిలుపు: మంత్రి నిమ్మల



అమరావతి,మే12(శ్రీచక్ర) : సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, మరమ్మతు పనులను చేపట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. 2025 ఖరీఫ్ ప్రారంభానికి ముందు నీటిపారుదల వ్యవస్థలను సాధారణ స్దితికి తీసుకురావాలని ఆదేశించారు. గేట్లు, షట్టర్లు, వంటి మెకానికల్ పనులను తప్పనిసరిగా అసిస్టెంట్ ఇంజనీర్ పరిశీలించి, సక్రమంగా పనిచేసే స్దితిలో ఉన్నాయనే ధ్రువీకరణ పత్రాన్ని, చీఫ్ ఇంజనీర్‌కు ఇవ్వాలని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఇరిగేషన్ పనులు, నిర్వహణ, మరమ్మత్తుల కోసం రూ. 344 కోట్లు- ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేశారని మంత్రి నిమ్మల తెలిపారు. అవసరమైన చోట్ల 7 రోజుల వ్యవధితో షార్ట్ టెండర్లను పిలవడానికి ప్రభుత్వం అనుమతిచ్చిందని అన్నారు. సోమవారం ఓ అండ్ ఎం పనులపై ఇరిగేషన్ అధికారులతో, మంత్రి నిమ్మల రామానాయుడు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్, కడా కమిషనర్ రాంసుందర్ రెడ్డి, ఈఎన్సీ వెంకటేశ్వరావు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సీఈలు, ఎస్ఈలు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడారు. సాగు నీటి సంఘాలు ఆధ్వర్యంలో, వారి పరిధిలోని పనులను, మే నెలాఖరుకు పూర్తిచేయాలని మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. పనులను సకాలంలో పూర్తిచేయడానికి చీఫ్ ఇంజనీర్లు, సూపరిం-టె-ండెంట్ ఇంజనీర్లు నిరంతరంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎట్టి పరిస్దితుల్లోనూ అన్ని పనులూ, సీజన్ మొదలయ్యే నాటికి పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. గతంలో మాదిరిగా కాకుండా మే చివరి నాటికి, అన్ని అత్యవసర పనులు, నాణ్యతతో పూర్తి చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడు నిర్దేశించారు.

# తిరుపతి జిల్లాలో అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం

తిరుపతి(శ్రీచక్ర) ,తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం అగరాల హైవే రోడ్డుపై ప్రమాదం జరిగింది. ఆదివారం అర్ధరాత్రి తమిళనాడు తిరువన్నమలై నుంచి శ్రీవారి భక్తులుతో తిరుపతికి వస్తున్న ఆర్టీసీ బస్సు అదుపుతప్పి డివైడర్ ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో 30 మందికి పైగా ప్రయాణికులు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, గాయపడిన వారిని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు.గాయపడిన వారిలో చిన్నారులు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం.




# పీఠాధిపతులకు తులాభారం

### -భారత్ రక్షణ మంత్రిత్వ శాఖకు రూ. 25 లక్షల విరాళం





మంత్రాలయం, మే 12, (శ్రీచక్ర) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థలు 13 వ పట్టాభిషేక మహోత్సవం పురస్కరించుకుని సోమవారం సాయంత్రం తులాభారం నిర్వహించారు. శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఠం అధిరోహించి 13 ఏళ్ల గడిచిన శుభ సందర్భంగా పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థలను పుష్పాభి షేకం చేసి ఘనంగా సత్కరించారు. అనంతరం నాణ్యాలతో తులాభారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి మాట్లాడుతూ దేశంలో ని జమ్మూ కాశ్మీర్ పహల్గాం లో జరిగిన దాడి ఘటన తర్వాత జరిగిన ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ఈ ఘటనకు ప్రతిస్పందనగా భారత కేంద్ర ప్రభుత్వం తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాత్మక చర్యలను ప్రశంసించారు. భారత దేశ భద్రత సాయుధ దళాల సంక్షేమం కోసం భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖకు రూ. 25 లక్షల విరాళాన్ని పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థలు ప్రకటించారు.

# రెండు దేశాల మధ్య కీలక చర్చలు

ఢిల్లీ:(శ్రీచక్ర) పాకిస్తాన్ భారతదేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో సరిహద్దుల్లో కాల్పుల విరమణ, తదనంతర పరిస్థితిపై భారత్, పాకిస్తాన్ మధ్య ఇవాళ(సోమవారం) మధ్యాహ్నం కీలక చర్చలు జరుగనున్నాయి. ఈ చర్చలను ఇరు దేశాల డైరెక్టర్ జనరల్ మిలటరీ ఆపరేషన్స్ - డీజీఎంఓలు జరుపనున్నారు. ఇరు దేశాల మధ్య మధ్యాహ్నం 12గంటలకు హాట్‌లైన్‌లో చర్చించనున్నారు. 48 గంటల పాటు కాల్పుల విరమణ, కొనసాగింపు, ఉద్రిక్త వాతావరణం తగ్గించడం వంటి కీలక అంశాలపై ఇరు దేశాలు చర్చించనున్నాయి. ఎలాంటి షరతులు లేకుండా చర్చలు జరగాలని ఒప్పందంలో భారతదేశం స్పష్టంగా చెప్పింది. కాల్పుల విరమణ ప్రాధాన్యతగా అంగీకారాన్ని పాకిస్తాన్ తెలిపింది. ముందస్తు, తదుపరి షరతులు లేకుండానే చర్చలు జరగాలని భారతదేశం పేర్కొంది. ఇప్పటికే శనివారం 3.35గంటలకు భారత్ డీజీఎంఓతో హాట్‌లైన్‌లో పాకిస్తాన్ డీజీఎంఓ మాట్లాడారు. కాల్పుల విరమణ అంశాన్ని ప్రతిపాదించి.. వెంటనే అమలు చేయాలని పాకిస్తాన్ కోరింది. 48 గంటల పాటు కాల్పుల విరమణ అమలు తర్వాత చర్చలకు పాకిస్తాన్ అంగీకరించింది.

# సంపాదకీయం

## మిత్రులు ఎవరు...శత్రువులు ఎవరు

భారత్?పాకిస్థాన్ మధ్య జరిగిన పరిమిత యుద్ధం, ఆపరేషన్ సింధూర్, భారత్‌కు అనేక రాజకీయ, దౌత్యపరమైన సత్యాలను వెల్లడించింది. ఈ యుద్ధం భారత్‌కు తన సన్నిహిత మిత్రులు, దాగి ఉన్న శత్రువుల గురించి స్పష్టమైన అవగాహనను అందించింది. ముఖ్యంగా, భారత్ గతంలో ఆర్థిక, రాజకీయ సహాయం అందించిన టర్కీ, ఈ సంక్షోభంలో పాకిస్థాన్ వైపు చేరడం భారత్‌కు ఒక పెద్ద ఆఘాతంగా పరిగణించబడింది. అదే విధంగా, అజర్‌బైజాన్ కూడా పాకిస్థాన్‌కు మద్దతు ఇవ్వడం గమనార్హం. ఇది భారత పర్యాటకుల నుంచి గణనీయమైన ఆదాయాన్ని ఆర్జిస్తున్న దేశం. ఈ రెండు దేశాలు భారత ఆర్థిక సహాయాన్ని పొందుతూ పాకిస్థాన్‌కు మద్దతు ఇవ్వడం భారత దౌత్య విధానాలను పునర్వ్యమర్శించేలా చేసింది. ఈ పరిమిత యుద్ధంలో చైనా పాకిస్థాన్‌కు మద్దతుగా నిలిచినప్పటికీ, దాని వైఖరి భారత్‌కు కొంత ఊరటనిచ్చింది. చైనా పాకిస్థాన్‌కు సరఫరా చేసిన ఆయుధాలు తక్కువ నాణ్యత (ః?గ్రేడ్) కలిగినవిగా ఉన్నాయని తెలిసింది. చైనా వద్ద అత్యాధునిక ఆయుధాలు ఉన్నప్పటికీ, వాటిని పాకిస్థాన్‌కు అందించకపోవడం వెనుక ఒక వ్యూహాత్మక ఆలోచన ఉ ందని విశ్లేషకులు భావిస్తున్నారు. పాకిస్థాన్‌పై చైనాకు పూర్తి నమ్మకం లేకపోవడం, అలాగే అమెరికాతో పాకిస్థాన్ సంబంధాలను దృష్టిలో ఉంచుకుని, తన అత్యాధునిక సాంకేతికత బయటపడకుండా జాగ్రత్తపడిందని అంచనా. ఈ విషయం భారత్‌కు చైనా యొక్క నిజమైన ఉద్దేశాలను అర్థం చేసుకోవడానికి సహాయపడింది, దీని ఫలితంగా పాకిస్థాన్ యొక్క సైనిక సామర్థ్యం భారత్‌కు పెద్ద ముప్పుగా మారలేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌కు అనుకూలంగా ఉంటారని భావించినప్పటికీ, ఈ యుద్ధంలో అమెరికా నిష్పక్షపాత వైఖరి భారత్‌కు కీలకమైన పాఠంగా నిలిచింది. ట్రంప్ పాకిస్థాన్‌కు అందించే ఆర్థిక సహాయంలో కోతలు విధించినప్పటికీ, యుద్ధ సమయంలో రెండు దేశాల మధ్య మధ్యవర్తిత్వం చేయడానికి సిద్ధపడ్డారు. ఈ వైఖరి భారత్‌కు అమెరికా దౌత్యపరమైన విధానాలను స్పష్టంగా అర్థం చేసుకునే అవకాశాన్ని ఇచ్చింది. ముఖ్యంగా కీలక సమయాల్లో అమెరికా తన స్వప్రయోజనాలను దృష్టిలో ఉ ంచుకుని నడుచుకుంటుందని తెలిసింది. గతంలో జో బైడెన్ అధ్యక్షత్వంలో పాకిస్థాన్‌కు మరింత మొగ్గు చూపిన నేపథ్యంలో, ట్రంప్ ఈ వైఖరి భారత్‌కు ఊరటనిచ్చినప్పటికీ, అమెరికాపై అతిగా ఆధారపడకూడదనే సందేశాన్ని కూడా ఇచ్చింది. ఇక ఈ యుద్ధంపై జీ7 దేశాలు భారత్‌తో సన్నిహిత సంబంధాలను కలిగి ఉన్నప్పటికీ, ఈ యుద్ధంలో శాంతి స్థాపనకు పిలుపునివ్వడంతోపాటు నిష్పక్షపాతంగా వ్యవహరించాయి. ఇది భారత్‌కు అంతర్జాతీయ రాజకీయాల్లో సమతుల్యతను అర్థం చేసుకునే అవకాశాన్ని ఇచ్చింది. అయితే, ఒక సానుకూల అంశం ఏమిటంటే, ఏ ప్రముఖ ముస్లిం దేశం కూడా పాకిస్థాన్‌కు బహిరంగంగా మద్దతు ఇవ్వలేదు. గత దశాబ్దంగా ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన విదేశీ యాత్రలు. దౌత్యపరమైన విధానాలు ఈ విషయంలో కీలక పాత్ర పోషించాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి దేశాలతో భారత్ బలమైన సంబంధాలు ఈ సంక్షోభంలో పాకిస్థాన్‌ను ఒంటరిగా నిలబెట్టడంలో సహాయపడ్డాయి. ఈ పరిమిత యుద్ధం ద్వారా పాకిస్థాన్ సైనిక సామర్థ్యం, రాజకీయ వ్యూహాల గురించి ప్రపంచానికి స్పష్టమైన చిత్రం అందింది. 'సరుకు తక్కువ, చప్పుడు ఎక్కువ' అనే సామెత పాకిస్థాన్‌కు సరిగ్గా సరిపోతుందని ఈ యుద్ధం నిరూపించింది. యుద్ధ సమయంలో పాకిస్థాన్ ప్రచార యంత్రాంగం అతిశయోక్తి కథనాలను వ్యాప్తి చేసినప్పటికీ, దాని సైనిక చర్యలు భారత్‌కు తీవ్రమైన నష్టం కలిగించలేకపోయాయి. ఈ యుద్ధం పాకిస్థాన్ ఆర్థిక బలహీనతలను, సైనిక పరిమితులను, అంతర్జాతీయ ఒంటరితనాన్ని బహిర్గతం చేసింది. ఈ పరిణామాలు భారత్‌కు భవిష్యత్తులో పాకిస్థాన్‌తో వ్యవహరించే విషయంలో మరింత దృఢమైన వైఖరిని అవలంబించే అవకాశాన్ని ఇచ్చాయి యుద్ధం భారత్‌కు అనేక పాఠాలను నేర్పించింది. ముఖ్యంగా, దౌత్యపరమైన సంబంధాలను మరింత బలోపేతం చేయడం, రక్షణ సామర్థ్యాలను మెరుగుపరచడం, అంతర్జాతీయ సమాజంలో తన ప్రభావాన్ని పెంచడం అవసరమని స్పష్టమైంది. భవిష్యత్తులో పాకిస్థాన్ ఉగ్రవాద కార్యకలాపాలను ప్రోత్సహించినా లేదా సరిహద్దు ఉద్రిక్తతలను సృష్టించినా, భారత్ దృఢమైన సైనిక, దౌత్యపరమైన చర్యలతో స్పందించేందుకు సిద్ధంగా ఉంది. ఈ యుద్ధం భారత్‌కు తన శక్తిని ప్రదర్శించే అవకాశాన్ని ఇచ్చింది, అదే సమయంలో అంతర్జాతీయ రాజకీయాల్లో సమతుల్యతను నేర్చుకునే అవకాశాన్ని కూడా అందించింది.

# దివ్యాంగుల పట్ల హేళనగా మాట్లాడుతున్నా వారి పై కఠిన చర్యలు

**- సదరన్ క్యాంపులలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలి.-జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.**



భీమవరం మే 12 శ్రీచక్ర.సోమవారం కలెక్టరేట్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పెన్షన్ పొందుతున్న వారికి రీ వెరిఫికేషన్ సదరన్ క్యాంపుల నిర్వహణపై డి సి హెచ్ ఎస్, డి ఆర్ డి ఏ, దివ్యాంగులు శాఖ, డిఎంహెచ్ఓ, తణుకు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ తో క్షుణ్ణంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ 6 వేలు, 15 వేలు పింఛన్లు పొందుతున్న దివ్యాంగులు జిల్లాలో మొత్తం 27,500 మంది ఉన్నారని, వారిలో ఇప్పటివరకు 9 వేల మందికి రీ వెరిఫికేషన్ పూర్తి చేయడం జరిగిందన్నారు. వెరిఫికేషన్ ప్రక్రియ అక్టోబర్ వరకు కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలో కొన్ని దివ్యాంగత్వ పరీక్షల నిర్వహణకు మిషనరీ అందుబాటులో లేనందున విశాఖపట్నం, గుంటూరు, రాజమండ్రి, విజయవాడ తదితర దూరం ప్రాంతాలకు రిఫర్ చేయడం జరుగుతుందని, దివ్యాంగులకు ఇది వ్యయ ప్రయాసలతో కూడుకున్నదిగా ఉండడం వలన చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. ఎంతమంది డాక్టర్లు రీవెరిఫికేషన్ సదరన్ క్యాంపుల్లో పాల్గొంటున్నారు, ఇప్పటివరకు ఎంతమందిని పరీక్షించారు, ఏ ఏ ప్రాంతాలకు సిఫారసు చేశారు, మన జిల్లాలో అందుబాటులో లేని పరికరాలు ఏంటి అనే విషయాలను చర్చించారు. తణుకులో బేరామిషన్ లేని కారణంగా వినికిడి దివ్యాంగత్వం కలిగిన వారికి పరీక్షలకు ఇబ్బంది ఎదుర్కొంటున్నామని, అలాగే పెరాలసిస్, మస్కులర్ డిస్ట్రోఫీ, మెంటల్ ఇల్నేస్, మెంటల్ రెట్రిడేషన్ సేవలు కూడా జిల్లాలో అందుబాటులో లేవని డిసిహెచ్ఎస్ జిల్లా కలెక్టర్ కు వివరించారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందిస్తూ తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న బెరామిషన్ వినియోగించుకోవడానికి పర్మిషన్ మంజూరు చేయవలసిందిగా డిఎంహెచ్ ఓను ఆదేశించారు. అలాగే ఆడియోలజిస్ట్ సేవలను కూడా వినియోగించుకోవాలని సూచించారు. దివ్యాంగత్వంలో నూరాలజీ సమస్య ఎంతమంది ఉన్నారు, ఇప్పటివరకు ఏ ఏ ప్రాంతాలకు రిఫర్ చేశారు, మిగిలిన వారిని ఏ ఏ ప్రాంతాలకు పంపించాల్సి ఉంటుంది తదితర సమాచారాన్ని వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఉన్న సమాచారాన్ని క్రోడీకరించి ఆయా ప్రాంతాలకు సంబంధిత బాధితులను పంపటానికి ప్రత్యేక రవాణాతో పాటు ఒక డాక్టర్ను వారికి సహాయకంగా నియమించి పంపించడానికి చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. జిల్లాలో జరుగుతున్న సదరన్ క్యాంపులు నిర్ణీత సమయంలో ప్రారంభం కాకపోవడం, కొంతమంది డాక్టర్లు దివ్యాంగులను హేళనగా మాట్లాడుతున్నారని ఇప్పటికే ఫిర్యాదులు అందాయని, ఇటువంటి చర్యలు ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, దివ్యాంగులతో అమర్యాదగా ప్రవర్తించినట్లు ఫిర్యాదు అందితే తీవ్రమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇటీవల జరిగిన డి డి ఆర్ సి సమావేశంలో తణుకు నియోజవర్గం శాసనసభ్యులు సదరన్ క్యాంపుల సేవలపై ప్రత్యేకంగా ప్రస్తావించడం జరిగిందన్నారు. కొన్ని కేసులను దూర ప్రాంతాలకు రిఫర్ చేయడం వలన వారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమావేశం దృష్టికి తీసుకురావడం కూడా జరిగిందని ఈ సందర్భంలో కలెక్టర్ ప్రస్తావించారు. ఈ సమావేశంలో డి సి హెచ్ ఎస్ డాక్టర్ పగడాల సూర్యనారాయణ, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్ఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి రామ్ కుమార్, తణుకు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ, డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ జి.గీతా బాయి, తదితరులు పాల్గొన్నారు.

## బాలింతలకు తక్షణ ఆర్థిక సాయం అందించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వీరుపాక్షి రెడ్డి ఆరోపణ,



ఎమ్మిగనూరు,మే, 12 (శ్రీ చక్ర):-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా మరిచిందని, ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలకు తక్షణ ఆర్థిక సహాయం అందించడంలో ఘోరంగా విఫలమైందని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వీరుపాక్షి రెడ్డి కూటమి ప్రభుత్వంపై మండిపడ్డారు. వారి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైయస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆరోగ్య ఆసరా పథకాన్ని అమలు చేస్తూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన ప్రతి బాలింతకు రూ.5000 తక్షణ ఆర్థిక సాయం కింద బాలింతలకు వారి బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరిగిందని తెలిపారు. ఈ విధానం గర్భిణీ స్త్రీలకు మానసిక, ఆర్థిక బలాన్నిచ్చింది. అయితే, ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆ పథకం పూర్తిగా నిలిచిపోయిందని తెలిపారు. లక్షలాది గర్భిణీలు తమ హక్కును కోల్పోతున్నారు. ఇదేంటి సంక్షేమ పాలన?" అంటూ ప్రశ్నించారు.ప్రజల కడుపులో తిండిలేక, బిడ్డల ఆరోగ్యం గాలికి వదిలేయడంతో ఈ కూటమి ప్రభుత్వానికి మొద్దు నిద్ర వేయడం లేదు. ప్రభుత్వ ఆసుపత్రులు నిత్యం జనంతో నిండిపోయి ఉన్నా, తక్షణ సహాయం లభించక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇది నేరచరిత్ర కూటమి ప్రభుత్వమని భావించాల్సిన ప్రభుత్వ వైఫల్యం అని విమర్శించారు. గర్భిణీ స్త్రీలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీ చేయించుకుంటేనే ఆరోగ్య ఆసరా లబ్ధి చేకూరేలా చేసిన వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలన ప్రజల మెప్పును పొందిందని తెలిపారు. కాని ఇప్పుడు అదే ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీ అయినా సాయం లేదు, సరైన వైద్యం లేదు, కనీసం ఔషధాలూ లేవు. ఇది సంక్షేమ పాలనా? లేక శాసన వంచనా?" అని కూటమి ప్రభుత్వాన్ని దీటుగా ప్రశ్నించారు. పేదలు ప్రభుత్వంపై నమ్మకంతో ఆసుపత్రులకు వస్తే ? వారు ఆదరణకోసం ఎదురుచూస్తున్న పరిస్థితి చూస్తుంటే హృదయం కలిచివేస్తోంది. ఇది రాష్ట్రానికి తలకిందుల పాలన. తక్షణ సహాయాన్ని పునరుద్ధరించకపోతే, ప్రజలు వీరిని తగిన విధంగా శిక్షిస్తారు" అని హితవు పలికారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలనలో ప్రజల కోసం ప్రతి అడుగు వేసిన విధానం, సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి బాటపెట్టిన విధానం, ప్రతి ఒక్కరికీ గుర్తుండేలా ఉంది. అదే విధంగా ప్రజల పక్షాన నిలిచి ఇప్పుడు కూడా ఈ నిర్లక్ష్యంపై గళమెత్తుతాం. ప్రజా హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తూ పేద ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. "ప్రసవ సమయంలో సాయం లేకపోవడం అంటే జీవన హక్కును కాలరాయడం వంటిదే" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నందవరం మండలఉపాధ్యక్షులురాఘవరెడ్డి,మల్లికార్జున,భీముడు ,హుశెని తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలకు గల్లా ఫ్యామిలీ దూరమేనా




గుంటూరు, మే 12, ఆంధ్రప్రదేశ్ లో గల్లా కుటుంబం రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకున్నట్లే కనిపిస్తుంది. ఇక ఆ కుటుంబం నుంచి రాజకీయాల్లో యాక్టివ్ అయ్యే వారు కూడా కనిపించడం లేదు. గల్లా అరుణ కుమారి వృద్ధాప్యంతో ఆమె రాజకీయాల నుంచి తప్పుకున్నారు. ఇక ఆమె కుమారుడు గల్లా జయదేవ్ కూడా గతంలో గుంటూరు ఎంపీగా రెండు సార్లు గెలిచి తర్వాత 2024 ఎన్నికలకు ముందు తాను రాజకీయాలకు కొంతకాలం విరామం ఇస్తున్నట్లు ప్రకటించారు. 2024 జరిగిన ఎన్నికల్లోనూ కూటమికి వీచిన బలమైన గాలిలో గల్లా జయదేవ్ ఖచ్చితంగా విజయం సాధించే వారు. మరోసారి పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికయ్యేవారు. అంతా బాగుంటే కేంద్ర మంత్రిగా కూడా అయ్యేవారు. కానీ తనంతట తానే తప్పుకోవడంతో ఆయన స్థానంలో గుంటూరు ఎంపీగా పోటీ చేసి గెలిచిన పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్రమంత్రి అయ్యారు. 2024 ఎన్నికలకు ముందు గల్లా జయదేవ్ రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు చెప్పారు. అయితే కొద్దికాలమేనని, తాను మళ్లీ రాజకీయాల్లో యాక్టివ్ అవుతానని ఆయన తెలిపారు. వ్యాపారాలను గాడినపెట్టేందుకు వాటిని విస్తరించేందుకే గల్లా జయదేవ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు రాజకీయాల్లో ఉండి వ్యాపారాలు చూసుకోవడం కష్టమని భావించి ఆయన వ్యాపారాలకే ప్రాధాన్యత ఇచ్చారు. రాజకీయాల్లోకి ఎప్పుడైనా మళ్లీ ఎంట్రీ ఇవ్వవచ్చని, వ్యాపారాలు ఒకసారి దెబ్బతింటే అన్ని రకాలుగా కోలుకోలేకుండా పోతామని ఆయన అంచనా వేసి ఈనిర్ణయం తీసుకున్నారు. ఆయన నిర్ణయంలో వాస్తవాలు చాలా ఉన్నాయనే అనుకోవాలి. కానీ ఇప్పుడు రాజకీయాల్లోకి వచ్చినా ఆయన పోటీచేయుడానికి ఎక్కడా ఖాళీలేదు. గుంటూరు నియోజకవర్గానికి టీడీపీ నేతగా పెమ్మసాని చంద్రశేఖర్ వచ్చారు. ఆయన కూడా వ్యాపారవేత్త. ఎంపీలలోనే అత్యంత సంపన్నుడు కూడా. గుంటూరు జిల్లాకు స్థానికుడు. ఆర్థికంగా బలవంతుడు. ఇక గుంటూరు నియోజకవర్గం మాత్రం గల్లా జయదేవ్ చేతుల్లోకి మళ్లీ రాదన్నది కూడా అంతే వాస్తవం. పెమ్మసానిని కాదని గల్లా జయదేవ్ కు భవిష్యత్ లో తెలుగుదేశం పార్టీ టిక్కెట్ ఇచ్చే అవకాశం అస్సలు ఉండదు. అందుకే ఇక గుంటూరు నియోజకవర్గం గల్లా రాజకీయ డైరీ నుంచి కొట్టి వేయక తప్పదని ఆయనకు అర్థమయింది. అందుకే రాజకీయాలకు దూరంగా ఉ న్నారు. పరిస్థితుల్లో గల్లా జయదేవ్ కు 2029 ఎన్నికల్లో ఏ నియోజకవర్గం ఖాళీ లేదు. కూటమి పార్టీలు మళ్లీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశముండటంతో అన్ని ప్రధానమైన పార్లమెంటు నియోజకవర్గాల్లోనూ ఆ పార్టీలకు చెందిన నేతలున్నారు. ఇక శాసనసభకు పోటీ చేసే ఆలోచన లేదు. వారి కుటుంబానికి అడ్డాగా ఉన్న చంద్రగిరి నియోజకవర్గంలో కూడా ఇప్పుడు పులవర్తి నాని ఉన్నారు. పైగా శాసనసభకు పోటీ చేసే ఆలోచనలో గల్లా జయదేవ్ లేరు. ఇక ఏదైనా ఛాన్స్ ఉంటే రాజ్యసభకు మాత్రమే ఆయన వెళ్లాల్సి ఉంటుంది. సామాజికవర్గం పరంగా చూసినా ఇప్పట్లో ఆఅవకాశం లేదన్నది కూడా అంతే నిజం. అందుకే గల్లా కుటుంబానికి రాజకీయానికి దాదాపుగా దూరమయినట్లేనన్నది రాజకీయ విశ్లేషకుల అంచనా.

# కరెంట్ షాక్ తప్పదా

ఒంగోలు, మే 12, ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వచ్చే నెలతో చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టి ఏడాది కావస్తుంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారు. అనేక హామీలు పెండింగ్ లో ఉన్నప్పటికీ నిధుల కొరత కారణంగానే అమలు చేయలేకపోతున్నామని చంద్రబాబు ప్రజలకు చెప్పడానికి ఏమాత్రం సంకోచించడం లేదు. ప్రజలు కూడా గత ప్రభుత్వం చేసిన అప్పుల నుంచి బయటపడాలంటే ఇచ్చిన హామీల కోసం మరికొంత కాలం వెయిట్ చేయాల్సి ఉంటుందని మానసికంగా సిద్ధమయ్యారు. చంద్రబాబు ప్రజలకు పదే పదే చెబుతూ వారిని హామీల విషయంలో పెద్దగా వ్యతిరేకత రాకుండా చూసుకోగలిగారు. ఒకే ఒక విషయంలో మాత్రం చంద్రబాబు చేయి దాటి పోయిందనే చెప్పాలి. అదే విద్యుత్తు బిల్లులు. ఆంధ్రప్రదేశ్ లో విద్యుత్తు బిల్లులు భారీగా వస్తున్నాయి. గతంలో రెండు వందల రూపాయలు వచ్చిన బిల్లు నేడు ఎనిమిది వందల రూపాయలకు చేరుకోవడంతో సామాన్యుల నుంచి వ్యాపారుల ఉన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాల కారణంగానే ట్రూ అప్ ఛార్జీలను విధించాల్సి వచ్చిందని ప్రభుత్వం పదే పదే చెబుతున్నప్పటకీ ప్రజల చెవుల్లోకి ఎక్కడం లేదు.


## నాగ శక్తి పిఠ స్థాపన భూమి పూజ





కోట మే 12 (శ్రీ చక్ర) : కోట మండలం చిట్టేడు గ్రామం నందు శ్రీ రాజ రాజేశ్వరి దేవస్థాన ప్రాంగణమునందు శ్రీ చిదానంద మహారాజ్ (దేవ ప్రయాగ నాగ శక్తి పీఠం ఉత్తరాధికారి) గారి కరకమలములు చే " శ్రీ చిదానంద ఆశ్రమము " నాగ శక్తి పీఠ స్థాపన భూమి పూజా కార్యక్రమం గ్రామ ప్రజలు నిర్వహించారు. శాస్త్రోక్తంగా వేద పండితులు యజ్ఞ యాగం నిర్వహించి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. రాబోవు రోజుల్లో ఈ దేవాలయ ప్రాంతం అభివృద్ధి చెంది,సకల దేవతలు దేవస్థానములు నిర్మాణం చేయ తలుస్తున్నట్లు గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణాపట్నం సుధాకర్,ఈగ రాజా రత్నం, పట్టపు కోటయ్య,శ్రీరాం విజయ శంకర్, చీరా సుబ్బమ్మ,గూడలి వెంకటేశ్వర్లు, దారా సుబ్బరామయ్య,గోనిపల్లి మల్లిఖార్జున,శ్రీరాం సురేష్,చిట్టేటి గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు అమ్మకాల స్టాల్




కోటమే 12 (శ్రీ చక్ర ) : రైతులు ఎటువంటి రసాయనాలు లేకుండా పండించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు స్టాల్ ను స్థానిక వెలుగు కార్యాలయం వద్ద ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సోమవారం కోట మండలంలోని వెలుగు కార్యాలయం వద్ద తిరుపతి జిల్లా ప్రకృతి వ్యవసాయం డీపీఎం ఆదేశాల మేరకు స్థానిక ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఓ చిన్నపాటి స్టాల్ ను నిర్వహించడం జరిగింది. ఎటువంటి రసాయనాలు లేకుండా పండించిన పలు రకాల ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను స్టాల్ లో గోంగూర,మునగ,చిర్రాకు, చిక్కుడు,వంగ,ముల్లంగి మొదలైనవి విక్రయించారు. ఇదే విధంగా రైతులందరూ రసాయనాలు లేకుండా పంటలు పండించి, అందరికీ ఆరోగ్యకరమైన ఉత్పత్తులు అందించాలని ప్రకృతి వ్యవసాయ మోడల్ మేకర్ శ్రీనివాసులు సూచించారు. ఈ కార్యక్రమంలో వెలుగు కార్యాలయం అకౌంటెంట్ బిందు,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పద్మ,ఐ సి ఆర్ పి ఎస్ శివకుమారి,భాగ్యలక్ష్మి,భాగ్యమ్మ లు ఉన్నారు.

## పెద్దకడుబూరు లో ప్రజా గ్రీవెన్స్ ప్రజా వేదిక కార్యక్రమం,ప్రజలు సమస్యలు స్వీకరించిన మండల తహసిల్దార్ గీత

ప్రియదర్శిని, పెద్దకడబూరు,మే, 12( శ్రీ చక్ర):- పెద్దకడుబూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాల్లో భాగంగా పలువురు మండల ప్రజలు, గ్రామీణ ప్రాంతా రైతులు తహసిల్దార్ కార్యాలయానికి వచ్చి పలు భూ రెవెన్యూ సమస్యలపై రైతులు భారీ ఎత్తున భూ రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని తాసిల్దార్ గీత ప్రియదర్శనికి రైతులు తమ యొక్క పలు భూ రెవెన్యూ సమస్యలను విన్నవించుకున్నారు. మా యొక్క భూ రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని రైతులు తమ యొక్క అర్జీలను తాసిల్దార్ కు అందజేశారు. రైతులు ప్రజా వేదిక కార్యక్రమాల్లో భాగంగా తమ యొక్క పలు అర్జీల పై విచారణ చేసి పలువురు రైతులకు భూ రెవెన్యూ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని వారికి హామీ ఇచ్చారు.



తదనంతరం జాయింట్ కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో మండల రెవెన్యూ తాసిల్దార్ గీతా ప్రియదర్శిని పాల్గొన్నారు.

శ్రీచక్ర

ఆదివారం 13 మే 2025


## నిర్దేశిత గడువులోగా సమస్యలను పరిష్కరించాలి

### నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు



కర్నూలు,మే 12 (శ్రీచక్ర): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్జీదారుల్లో సంతృప్తి స్థాయి పెంచే విధంగా నిర్దేశిత గడువులోగా వాటికి శాశ్వత పరిష్కారం చూపాలని నగరపాలక సంస్థ కమిషనర్ యస్.రవీంద్ర బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 10 వచ్చాయి. ఒక్కొక అర్జీదారుడి నుండి సమస్యను అడిగి తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ సంబంధింత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఇంచార్జ్ ఎస్ఈ శేషసాయి, టిపిఆర్ఓ వెంకటలక్ష్మి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు. 1. ఎల్బీజి నగర్ నందు అసంపూర్తిగా ఉన్న డ్రైనేజీ కాలువ పనులను పూర్తి చేయాలని రహంతుల్లా, అబ్దుల్ సలాం, తదితరులు కోరారు. 2. మద్దూర్ నగర్ మున్సిపల్ కాంప్లెక్స్ షాప్ నెంబర్ 18 నందు డ్రైనేజీ కాలువ లేదని, షాపు ఆనుకుని ఉన్న బంకులను తొలగించాలని షాపు లీజుదారురాలు జి.హనుమంతమ్మ ఫిర్యాదు చేశారు. 3. వీకర్ సెక్షన్ కాలనీ తన నివాసాల వద్ద సిసి డ్రైనేజీ కాలువ లేక ఇబ్బంది పడుతున్నామని స్థానికులు షేక్.ఫారుఖ్ విన్నవించారు. 4. టిడ్కో గృహం కొరకు తన దరఖాస్తు ఉపసంహరించుకున్నందున తాను చెల్లించిన డిడి నగదును తిరిగి వెనక్కి ఇవ్వాలని పి.మద్దయ్య కోరారు.

## కేంద్ర ప్రభుత్వం నుంచి తక్షణమే ఎమ్మిగనూరు- కర్నూలుకు జాతీయ రహదారిని మంజూరు చేయించాలని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఎమ్మెల్యే బీవీ విజ్ఞప్తి,



ఎమ్మిగనూరు,మే, 12( శ్రీ చక్ర):- కేంద్ర ప్రభుత్వం నుండి తక్షణ ఆర్థిక సహాయం కింద ఎమ్మిగనూరు నుండి కర్నూలుకు ప్రధాన జాతీయ రహదారిని మంజూరు చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు వినతిపత్రాన్ని సమర్పించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం చంద్రబాబు హైవే మంజూరు అంశంపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి ప్రత్యేక లేఖ రాశారు. అడిగిన వెంటనే కేంద్రానికి లేఖ రాయడం పట్ల ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అదే విధంగా ఎమ్మిగనూరుకు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును వెంటనే మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి కోరారు. వెంటనే చంద్రబాబు స్పందించి చర్యలు తీసుకోవాలని సీఎం సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.అదే విధంగా గతేడాది మరణించిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ సంక్షేమ నిధి ద్వారా ఆర్థికసాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వినతులపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

## ఆటో బోల్తా.. వ్యక్తి మృతి..



మంత్రాలయం, మే 12, (శ్రీచక్ర) : వెల్డింగ్ వర్క్ చేస్తూ జీవనం సాగిస్తున్న గొల్ల సూగూరు లక్ష్మన్న కుమారుడు గొల్ల పవన్ (23)ఆటో బోల్తా పడి మృతి చెందాడు. సోమవారం నందవరం మండల పరిధిలోని నదీ కైరవాడి గ్రామానికి చెందిన పవన్ ఎమ్మిగనూరు నుండి ఏపి 21 టివై 7805 నెంబర్ గల షేక్ ఖాసిం కు చెందిన ప్యాసింజర్ ఆటోలో 8 టన్నుల ఇనుప కడ్డీలను వేసుకుని షేక్ ఖాసిం డ్రైవింగ్ చేస్తుండగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ షాపింగ్ కాంప్లెక్స్ ఎదురుగా ఆటో ఒకవైపుకు వరిగిన నేపథ్యంలో పవన్ ఆటో వాలకుండా పట్టుకునే సమయంలో ఆయన పై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య ముగ్గురు సంతానం ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా సమస్యలను పరిష్కరించాలి: ఇంచార్జి కలెక్టర్ డా.బి.నవ్య






కర్నూలు, మే 12 (శ్రీచక్ర): అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా సమస్యలను పరిష్కరించాలని ఇంచార్జి కలెక్టర్ డా.బి.నవ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ - పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా ఇంచార్జి కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు.ఫిర్యాదుల స్వీకరణ అనంతరం ఇంచార్జి కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు.. పిజిఆర్ఎస్ లో వచ్చిన దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఇంచార్జి కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పిజిఆర్ఎస్ కు సంబంధించి రీఓపెన్ కేసుల మీద ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పిజిఆర్ఎస్ లాగిన్ లో వచ్చిన అర్జీలను అలసత్వం వహించకుండా పెండింగ్ లో లేకుండా ఎప్పటికపుడు చూడాలన్నారు. అలాగే అర్జీదారులతో గౌరవపూర్వకంగా వ్యవహరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సిఎంఓ గ్రీవెన్స్ లకు సంబంధించి కర్నూలు ఆర్డీఓ వద్ద 23, ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 23, పత్తికొండ ఆర్డీఓ వద్ద 7, సర్వే ఏడి వద్ద 2, వ్యవసాయ శాఖ, డిఆర్డిఏ పిడి, డ్వామా పిడి ల వద్ద ఒక్కొక్క దరఖాస్తు చొప్పున పెండింగ్ లో ఉన్న వాటిని బియాండ్ ఎస్ఎల్ఏ వెళ్లకుండా పరిష్కరించాలని ఇంచార్జి కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామ సభల ద్వారా అర్హులైన కౌలు రైతులను గుర్తించండి. గ్రామ సభల ద్వారా అర్హులైన కౌలు రైతులను గుర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని ఇంచార్జి కలెక్టర్ తహసిల్దార్ లను ఆదేశించారు.. తద్వారా గుర్తించిన కౌలు రైతులకు సిసిఆర్సి కార్డులు ఇప్పించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. 25 వేల సిసిఆర్సి కార్డుల జారీ చేయాలని జిల్లాకు లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు.. ముందుగానే అర్హులైన కౌలు రైతులను గుర్తించి వారికి సీసీఆర్సీ కార్డులు ఇప్పించిన ఎడల వారు ప్రైవేట్ వ్యక్తుల వద్ద డబ్బులు తీసుకోకుండా బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించే విధంగా తగిన చర్యలు తీసుకోవచ్చునన్నారు.. గ్రామసభలు ఏర్పాటు చేసుకునేందుకు షెడ్యూల్ ను తయారు చేసుకోవాలని, అదే విధంగా గ్రామసభలు ఎప్పుడు నిర్వహిస్తున్నారనే విషయాన్ని ప్రజలకు ముందుగానే తెలియచేయాలని సూచించారు. దేవాదాయ శాఖ , వక్ఫ్ శాఖల అధికారులు కూడా ఈ అంశంలో తగిన చర్యలు తీసుకోవాలని, వాటికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఇంచార్జి కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడి చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.×ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంలో కొన్ని వినతులుఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ స్టేట్ కౌన్సిల్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బి.నాగరాజు, నగర అధ్యక్షులు బీరప్ప, తదితరులు కర్నూలు నగరం లో గత చాలా రోజుల నుండి కలర్స్, అనూష్, హెర్ అండ్ స్కిన్ సెంటర్లు ప్రభుత్వ అనుమతులు లేకుండా నడుపుతూ ప్రజల ఆరోగ్యం ఇబ్బంది పడేలా చేస్తున్నారు. కావున అలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. హోలగుంద మండలం మార్లమడికి గ్రామ రైతులు కె కర్రెన్న, నల్లారెడ్డి, ఎన్ భాస్కర్, గోవర్ధన్, రాము, తదితర రైతులు, మా గ్రామములో ఈ సంవత్సరం జొన్న పంట వేసినాము, రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సప్లై వారిచే జొన్నలను కొనుగోలు చేశారు, అయితే ఇంకా కొంతమంది రైతుల వద్ద దాదాపు 700 క్వింటాళ్ల జొన్నలు ఉన్నాయి, వాటిని కూడా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కర్నూలు నగరం గోపినగర్ నివాసి జగన్నాథ్ రెడ్డి, నాకు కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామ పొలిమేరలో సర్వేనెంబర్ 405 లో ఒక్క ఎకరా 49 సెంట్లు, సర్వేనెంబర్ 410 లో ఒక్క ఎకరా 68 సెంట్లు భూమి కలదు, ఈ భూమి మా పెద్దల ఆస్తి ఈ భూమి వివరాలను ఆన్లైన్లో నమోదు చేయించాలని కోరుతూ అర్జీ సమర్పించారు.


## పీఠాధిపతి 13వ పట్టాభిషేక మహోత్సవం





మంత్రాలయం, మే 12,(శ్రీచక్ర) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థల 13వ పట్టాభిషేక మహోత్సవం వేడుకలు వైభవంగా జరిగాయి. సోమవారం పట్టాభిషేకం సందర్భంగా బ్రహ్మ దేవునిచే పూజింప బడిన శ్రీ మూల రామ దేవతలకు, షోడశ బాహు నరసింహ స్వామికి ఎంతో భక్తితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశంలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల దృష్ట్యా, భారత సైనికులు, భారత పౌరుల రక్షణ, శ్రేయస్సు కోసం భగవంతుని ఆశీస్సులు కోరుతూ శ్రీ మఠంలో మృత్యుంజయ, ఆయుష్య, మార్కండేయ మరియు ఇతర ప్రత్యేక హోమాలు జరిగాయి. జాతీయ సంక్షోభాన్ని పరిగణనలోకి తీసుకుని, సాంప్రదాయ మరియు ముఖ్యమైన మతపరమైన ఆచారాలు తప్ప మరే వేడుకలు నిర్వహించబోమని పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థలు సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో ప్రముఖ కన్నడ సినీ నటుడు, ప్రజాకీయ పార్టీ అధ్యక్షుడు ఉపేంద్ర తన కుటుంబంతో సహా పాల్గొన్నారు. అలాగే ప్రముఖ కన్నడ సినీ నటి తార పాల్గొన్నారు.

## ఎంజి పెట్రోల్ బంక్ లో పనిచేస్తున్న రాజు మృతదేహంతో కలిసి మృతి చెందిన కార్మికునికి నష్టపరిహారం ఇవ్వాలని బాధితులతో కలిసి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన,





ఎమ్మిగనూరు,మే,12 (శ్రీ చక్ర ):- ఎమ్మిగనూరు పట్టణంలో ఎంజి పెట్రోల్ బంక్ నందు గత 15 సంవత్సరాల నుండి పనిచేస్తున్న పెట్రోల్ బంక్ కార్మికుడు రాజు మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పెట్రోల్ బంక్ యజమాన్యం ఆదుకోవాలని కోరుతూ ఎంజి పెట్రోల్ బంక్ నందు రాజు మృతదేహంతో పెద్ద ఎత్తున వారి బంధువులతో కలిసి బాధితుల తరఫున న్యాయం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (అఖఎ) ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.ఎట్టకేలకు స్పందించిన ఎంజి పెట్రోల్ బంక్ యజమానులు మృతి చెందిన రాజు కుటుంబానికి అన్నివేళలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

## రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డి,




ఎమ్మిగనూరు, మే, 12 (శ్రీ చక్ర):- ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మిగనూరుకు మంజూరైన క్రిటికల్ కేర్ సెంటర్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.గతంలో ఎమ్మిగనూరుకు క్రిటికల్ కేర్ సెంటర్ కోరుతూ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు చేశారు. అయితే ప్రభుత్వం నుంచి క్రిటికల్ కేర్ సెంటర్ మంజూరైనా నిధుల విడుదలలో జాప్యం జరిగింది. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే మంత్రి గారి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన సంబంధిత ఆరోగ్య శాఖ మంత్రి క్రిటికల్ కేర్ సెంటర్ నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.అనంతరం ఈ నెల 21వ తేదీన ఎమ్మిగనూరు ఏరియా ఆస్పత్రి ప్రారంభోత్సవానికి రావాలని ఎమ్మెల్యే బివి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ని ఏరియా హాస్పిటల్ ప్రారంభోత్సవానికి రావాలని విజ్ఞప్తి చేశారు.

# దొంగతనం కేసులో ముద్దాయి అరెస్టు

## బంగారు వస్తువులు స్వాదినము

కర్నూలు, మే 12 (శ్రీచక్ర): కర్నూలు మండలము ఆర్ .కొంతలపాడు గ్రామం నందు ఈ నెల 7వ తేదీన ఫిర్యాది కురువ శ్రీనివాసుల తన ఇంటికి ఉదయం 11.00 గంటల సమయములో తాళము వేసుకొని తన పిన్ని ఊరు అయిన ముచ్చోనిపల్లె గ్రామములో దేవర వున్నందున అక్కడికి వెళ్ళి తిరిగి మధ్యాహ్ననీ 1.30 గంటలకు ఇంటికి వచ్చి చూడగా, ఇంటి తలుపులు తెరవబడి ఉన్నవని, తాను ఇంట్లోకి వెళ్ళి చూడగా, ఇంట్లోని బీరువా తాళం పగలగొట్టబడి, బీరువా తెరవబడి ఉన్నది. బీరువలోని బట్టలు చిందర వందరగా పడి ఉన్నాయి. ఇంటిలో బీరువలో 13 తులాల బంగారు ఆభరణములు కనబడలేదు. పోయిన మొత్తము ఆభరణముల విలువ సుమారు రూ.7,86,500/- ఉంటుందని, ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనం చేసినారని కర్నూలు తాలూకా పోలీసు స్టేషన్ నందు ఫిర్యాదు చేయడమైనది. కర్నూలు తాలుకా పోలీసులు అరెస్ట్ కాబడిన ముద్దాయి యొక్క వివరాలు: షేక్ అబ్దుల్ కలాంఏమచ్చ, వయస్సు 24 సం.,లు, తండ్రి: షేక్ మస్తాన్, సొంతవూరు పోతుగల్లు గ్రామము, కృష్ణగిరి మండలము, కర్నూలు జిల్లా ప్రస్తుతం నియర్ కొండపేట రోడ్డు, ఎమ్మిగనూరు రోడ్డు, కోడుమూరు గ్రామము, మరియు మండలము, కర్నూలు జిల్లా.



అరెస్టు చేసిన తేదీ, సమయము మరియు స్థలం: 12 వ తేదీ ఉదయం 08.30 గంటల సమయములో రాబడిన సమాచారం మేరకు కర్నూలు మండలము, మునుగలపాడు గ్రామము , తిప్పమ్మ కొట్టం వద్ద సీఐ ఎం శ్రీధర్ అరెస్ట్ చేయడమైనది. రికవరీ వివరాలు:బంగారు ఆభరణములు , ఆరు తులాల వెండి పట్టీలు, మొత్తం విలువ రూ.7,50,000/-13తులాల బంగారం, సుమారు 06 తులాల వెండి. అరెస్టు చేసిన పోలీస్ అధికారులు, కర్నూలు తాలూకా యూపీఎస్ సీఐ ఎం శ్రీధర్, వైఎస్ ఐ రామాంజనేయులు, మరియు సిబ్బంది కర్నూలు డీఎస్పీ భాబాబుప్రసాద్ అభినందిచడమైనది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పై కేసులో ముద్దాయి గురించి గూడూరు ప్రజలు ఇచ్చిన విలువైన సమాచారం మేరకు పోలీసు వారు ముద్దాయి గురించి ఆచూకీ లాగి పై సమయం నందు అరెస్టు చేయడం జరిగింది. ఈ విషయముగా ప్రజలుఇచ్చిన సమాచారం మేరకు ముద్దాయిని తక్కువ సమయంలోనే అరెస్టు చేయడంలో ప్రజల సహకారం చాలా ఉపయోగపడిందని, ఇక ముందు కూడ ప్రజల సహకారం ఇలాగే ఉండాలని కోరుతూ అభినందించారు.

శ్రీచక్ర
SREECHAKRA TELUGU DAILY
ఆదివారం 13 మే 2025

# మే 20న దేశవ్యాప్తంగా జరుగుతున్న సమ్మెను జయప్రదం చేయాలి




వీరవాసరం మే 12 :(శ్రీ చక్ర) ఉద్యోగ కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్లను రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వివిధ ఉద్యోగ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. వీరవాసరంలో సోమవారం జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం ఆంజనేయులు మాట్లాడారు. ఉద్యోగులను కార్మికులను సంఘాలు పెట్టనివ్వకుండా వారి సమస్యలపై మాట్లాడనివ్వకుండా చేయడానికి లేబర్ కోడ్లను కేంద్ర పాలకులు తీసుకువచ్చారని అన్నారు. కనీస వేతనాలు లేవని చట్టాలలో పొందుపరిచిన అంశాలు ఏమీ అమలు జరగడం లేదని గొంతేతి అరిచినా పట్టించుకోని ప్రభుత్వాలు చట్టాలు లేకపోతే కార్మికులను ఉద్యోగులను మనుషులుగా కూడా చూడవని అన్నారు. పోరాడి సాధించుకున్న చట్టాలే మాకు కావాలని వాటిని కట్టుదిట్టంగా అమలు చేయాలని దేశవ్యాప్తంగా 20వ తేదీన సమ్మె జరుగుతుందని అన్నారు. స్వాతంత్రం వచ్చిన దగ్గర్నుంచి ఉద్యోగులు కార్మికుల సంక్షేమం కోసం చట్టాలను చేసిన ప్రభుత్వాలను చూసాము కానీ ఉన్న చట్టాలను రద్దు చేసే ప్రభుత్వం కేంద్ర బిజెపి ప్రభుత్వమేనని అన్నారు. దేశీయ ఉత్పత్తులను పెంచడంలో, పరిశ్రమలు నిర్మించడంలో, ఉద్యోగాలు కల్పించడంలో, ధరలు తగ్గించడంలో విఫలమైన ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పడానికి నానా అవస్థలు పడుతుందని అన్నారు. సిఐటియు మండల అధ్యక్షులు వరలక్ష్మి మాట్లాడుతూ మండలంలోని ఉద్యోగులు కార్మికులతో పాటు భవన నిర్మాణ కార్మికులు రవాణా కార్మికులు వివిధ రకాల సంస్థలు వ్యాపార వాణిజ్య వర్తక సంఘాలు అందరూ సమ్మెలో పాల్గొవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగ మే 20 సమ్మె గోడ పత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు సత్యవతి, వివో ఏ సంఘం నాయకులు భవాని, మిడ్ డే మీల్ కార్మిక సంఘం నాయకులు మద్దాల శ్రీనివాస్, పంచాయతీ కార్మిక సంఘం నాయకులు మల్లుల ఏసుబాబు, వృత్తిదారుల సంఘం నాయకులు సుబ్బారావు, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 15వ రోజుకు చేరుకున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు నిరవధిక సమ్మె






భీమవరం మే 12 శ్రీచక్ర భీమవరం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేస్తున్న నిరవధిక సమ్మె సోమవారంకు 15వ రోజుకు చేరుకుంది. ముందుగా ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఏపీ ఎంసీఏ జిల్లా అధ్యక్షురాలు పి శిరీష రాణి, సెక్రటరీ కే విజయ సీతారామరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైన స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సిహెచ్ఓలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవలే జిల్లా కలెక్టర్ కు వినతిపత్రాన్ని అందించిన ఫలితాలు కనిపించడం లేదన్నారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం 6 ఏళ్ళు పూర్తి చేసుకున్న సిహెచ్ఓ లను రెగ్యులర్ చేయాలనీ, ఎన్ హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలని, నిర్దిష్టమైన జాబ్ కార్డులను అందించాలని, హెచ్ ఆర్ పాలసీ ఇంక్రిమెంట్ ట్రాన్స్ ఫోర్, ఎక్స్ గ్రేషియా తదితర సెలవులను అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. నర్సింగ్ అనేది ఒక వృత్తి కాదని, ఒక సేవ అని, తన పని ద్వారా స్థాపించిన మహిళను గౌరవించడానికి నర్సుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో కె దిలీప్, ఫ్రాన్సిస్, వీ రజిత తదితరులు పాల్గొన్నారు.

# ఎలాంటి ఉత్తర్వులు లేకుండా దళితుల ఇళ్లకు కరెంటు తొలగించడం అన్యాయం

**×వెంటనే పునరుద్ధించకపోతే ఉద్యమం చేపడతాం**
**కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి**
**కాళ్ళ లంక రోడ్డులో బాధిత దళితులను పరామర్శించిన కెవిపిఎస్ బృందం**





భీమవరం/ కాళ్ల మే 12 (శ్రీచక్ర ) ఎలాంటి అధికారిక ఉత్తర్వులు లేకుండా దళితుల ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ తొలగించడం అన్యాయమని, వెంటనే పునరుద్ధరించకపోతే ఉద్యమిస్తామని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి హెచ్చరించారు. సోమవారం కాళ్ల మండల కేంద్రంలో లంక రోడ్డులో ఉన్న దళితుల ఇళ్లను కెవిపిఎస్ బృందం పరిశీలించి, బాధితులను పరామర్శించారు. అధికారులతో ఫోన్ లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండల కేంద్రంలో లంక రోడ్ లో ఉన్న పది దళిత కుటుంబాలకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా దుర్మార్గమైన పద్ధతుల్లో అక్రమంగా కరెంటు కట్ చేయడం అన్యాయమన్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులు చీకట్లో ఉంటూ కొవ్వొత్తుల వెలుగులో చదువుకుని పరీక్షలకు ఈ రోజుల్లో కూడా అలా వెళ్లడం సిగ్గుచేటు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే రఘురామకృష్ణం రాజు ఆదేశాల ప్రకారమే దళితుల ఇళ్ళకు కరెంట్ కట్ చేశారని ఆరోపించారు. కెవిపిఎస్ బృందం 10 దళితు కుటుంబాలను పరిశీలించగా బాధితులు చెప్పిన వివరాల ప్రకారం స్థానిక ఏ.ఇ తో మాట్లాడామన్నారు. ఎమ్మెల్యే ఆదేశాలను నియోజకవర్గంలో ఉన్న అధికారులంతా అలా పాటించాల్సి వస్తుందని చెప్పడం విడ్డూరంగా ఉ ందన్నారు. పంచాయతీ అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు ఎమ్మెల్యే ఆదేశాలతోనే కరెంట్ కట్ చేసినట్లు చెప్పారన్నారు. రికార్డు పూర్వకంగా ఏమైనా ఉందా అని అడిగితే అలాంటిదేమీ లేదని తెలిపారన్నారు. ఈ విషయమే గతంలో ఆర్ అండ్ బి అధికారులు కరెంటు కట్ చేయమని మేము ఎప్పుడూ అధికారులకు చెప్పలేదని రాతపూర్వకంగా ఎవరిని ఇచ్చారని చూపారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగానే ఎలక్ట్రికల్ ఏఈ, పంచాయతీ అధికారులు కుమ్మక్కై దళితులు కాబట్టే కరెంటును కట్ చేశారని తక్షణం వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దళితులు కాబట్టే ఆధిపత్యాన్ని చూపించి అన్యాయంగా కరెంటు కట్ చేశారన్నారు. కరెంటు కట్ చేసినా 6నెలలుగా కరెంటు బిల్లు చెల్లిస్తున్నారన్నారు. తక్షణం కరెంటు ఇవ్వకపోతే రోడ్డెక్కి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రత్యామ్నాయం చూపించే ఇళ్ళు తొలగిస్తున్నామని చెపుతున్న ఎమ్మెల్యే అవాస్తవాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఏసీ గదుల్లో ఉండటం కాదని నియోజకవర్గంలో తొలగించాలనుకుంటున్న ఇళ్ళకు వచ్చి బాధితులతో మాట్లాడాలన్నారు. ఈ 10దళితుల ఇళ్లల్లో ఒకొక్క ఇంట్లో 2,3కుటుంబాలు నివసిస్తున్నాయని చెప్పారు. తక్షణం ఇల్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో శాసనసభ డిప్యూటీ స్పీకర్ పదవికి అప్రతిష్ట అని అన్నారు. లేనిపక్షంలో అధికారులను భయపెట్టి, మభ్యపెట్టి దళితులపై మీ ఆధిపత్యం చెలాయిస్తామంటే చూస్తూ ఊరుకోమన్నారు. గతంలో అంబేద్కర్ ఫ్లెక్సీలను మీరు చింపి దళిత వ్యతిరేకతను చూపించారని ఇప్పుడు దళితుల ఇళ్ళకు కరెంటు కట్ చేయించి మరింత ఆధిపత్యం చూపుతున్నారని మండిపడ్డారు. ప్రత్యామ్నాయం అంటే స్థలాలు చేతిలో పెట్టడం కాదు ఇళ్ళు కట్టి ఇవ్వడం : జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు అనంతరం కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి పేరుతో తొలగిస్తున్న పేదల ఇళ్ళకు ప్రత్యామ్నాయం చూపుతున్నారని ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు చెపుతున్నారని ప్రత్యామ్నాయం అంటే ఇళ్ల స్థలాలు చూపి పట్టాలు చేతికివ్వడం మాత్రమే కాదని పక్కా ఇల్లులు కట్టించి ఇవ్వడమని అన్నారు. ఉన్న ఇళ్లను కూల్చేసి ఖాళీ స్థలాలు ఇస్తే ఇప్పటికిప్పుడు పేదలు ఎక్కడికి వెళ్తారన్నారు. ఇప్పటివరకు ఉన్న ఇంటి నిర్మాణం చేసుకున్న వాటికి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇల్లు కట్టుకొనే వరకు అద్దె కూడా ప్రభుత్వమే చెల్లించాలన్నారు. అలాంటి సహకారం పేదలకు అందిస్తేనే ఇల్లు కూల్చే కార్యక్రమం పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, సిఐటియు జిల్లా నాయకులు గొర్ల రామకృష్ణ, బాధితులు పద్మారావు, విజయ్ కుమార్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77 ను రద్దు చేయాలి

**రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం**
**పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే 107 108 జీవోలను రద్దు చేయాలి**
**యువగళం పాదయాత్రలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి**
**ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ**




భీమవరం మే 12( శ్రీచక్ర) రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ పశ్చిమగోదావరి జిల్లా సమితి ఆధ్వర్యంలో, సోమవారం భీమవరం నందు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ మాట్లాడుతూ ఎన్నికలలో ఎన్డీఏ కూటమి ఇచ్చినటువంటి హామీలో భాగంగా వీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు, వైసీపీ ప్రభుత్వం పేద మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత చదువులకు దూరం చేసే పద్ధతులలో జీవో నెంబర్ 77 తీసుకువచ్చి కేవలం ప్రభుత్వ విద్యాసంస్థలు చదివే వారికి మాత్రమే ఫీజు రీయింబర్స్మెంట్ పథకం వర్తింపజేస్తుందని ప్రైవేట్ విద్యాసంస్థల్లో వీజీ చేసే విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ వర్తించదని జీవో నెంబర్ 77 తీసుకోవడం జరిగిందన్నారు, తక్షణమే జీవో నెంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు.. రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది విద్యార్థులతో కిటకిటలాడుతున్న యూనివర్సిటీలలో రాష్ట్రవ్యాప్తంగా కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ తీసుకోవడం వల్ల యూనివర్సిటీలో విద్యార్థులు లేనటువంటి దౌర్భాగ్యమైనటువంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో నెలకొంది అన్నారు, రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీలో బాగుపరచాలంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కామన్ ఎంట్రెన్స్ ప్రవేశ పరీక్షను రద్దుచేసి ఏ యూనివర్సిటీకి సంబంధించిన ప్రవేశ పరీక్ష హ యూనివర్సిటీ నిర్వహించే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్న సందర్భంలో వైద్య విద్యను పేదలకు దూరం చేసే విధంగా జీవో నెంబర్ 107 108 తీసుకువచ్చి వైద్య విద్యను కోట్ల రూపాయలకు అమ్ముతుండడంతో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆ జీవోలను రద్దు చేస్తూ ప్రతి పేద విద్యార్థికి వైద్య విద్యను అందే విధంగా చూస్తామని హామీ ఇచ్చారని గుర్తుకు చేశారు, తక్షణమే పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే జీవో నెంబర్ 107 108 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ ఇంజనీరింగ్ పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ వసతి దివన బకాయిలు తక్షణమే విడుదల చేయాలన్న తూతూ మంత్రంగా 788 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసి చేతులు దులుపుకుందన్నారు,, మాకు కావాల్సింది 788 కోట్లు కాదు 3580 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.. రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ఇష్టానుసారంగా ఫీజులు దోపిడీ చేస్తున్నారని, ప్రభుత్వ నిబంధనకు వ్యతిరేకంగా పాఠ్యపుస్తకాలను వేలాది రూపాయలకు అమ్ముకుంటూ వ్యాపారం చేస్తున్నా కూడా కూటమి ప్రభుత్వం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుందని అన్నారు. ఇప్పటికైనా ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని పేర్కొన్నారు,రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు శ్రీకరం చుడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు కె. యామిని శ్రీ మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి , సిహెచ్ సుందర్. లోకేష్ , అనురాధ పాల్గొన్నార.

# గౌతమ బుద్ధుని బోధనలు ఆచరణీయం

**అడిషినల్ డిఎస్పీ భీమారావు**

**భీమవరంలో ది బుద్దిస్ట్ సొసైటీ అఫ్ ఇండియా ఆధ్వర్యంలో గౌతమ బుద్ధుని జయంతి**



భీమవరం మే 12 (శ్రీచక్ర ) ప్రపంచ మానవాళికి చక్కటి జీవన విధానాన్ని అందించిన గౌతమ్ బుద్ధుడు గొప్ప దర్శనీయకుడని, అయన చూపిన మార్గం ఆచరణీయమని అడిషనల్ డిఎస్పీ వి భీమారావు అన్నారు. భీమవరం అంబేడ్కర్ సెంటర్ లో ది బుద్దిస్ట్ సొసైటీ అఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు ఈది రవికుమార్ ఆధ్వర్యంలో గౌతమ బుద్ధుని జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా బుద్ధుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళిలర్పించారు. అడిషనల్ డిఎస్పీ భీమారావు మాట్లాడుతూ గౌతమ బుద్ధుని బోధనలు ప్రపంచం మొత్తానికి ఆదర్శనీయమని అన్నారు. సిఐలు నాగరాజు, వి పుల్లారావు మాట్లాడుతూ విశ్వ మానవాళికి ప్రేమతత్వాన్ని అహింసను బోధించిన బుద్ధుని బోధనలు నేటికీ సదా ఆచరణీయమని అన్నారు. ది బుద్దిస్ట్ సొసైటీ అఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు కోనా జోసెఫ్, జిల్లా అధ్యక్షులు ఈది రవికుమార్ మాట్లాడుతూ రాగద్వేషాలతో హింసతో సతమతమవుతున్న మానవాళిని జాగృత పరచడానికి ఉద్భవించిన మహాపురుషుడు గౌతమబుద్దులని అన్నారు. ఆ మహానుభావుని బోధనల స్ఫూర్తితో హింసకు, వివక్షకు చోటులేని శాంతియుత, సమసమాజాన్ని నిర్మించేందుకు కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో గంటా సుందర్ కుమార్, గాతల సందీప్, బేతాళ కమలకర్, బుంగా ఆదామ్ రాజు, ఈది శేఖర్, ప్రశాంత్, పిల్లి ముసలయ్య, దాసు, కె లాజర్, కేసి రాజు, కొల్లి శ్రీనివాస్, నరసింహం, గుంటి ప్రభు, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నతి రుణాల మంజూరు, రికవరీలో రాష్ట్రంలోనే పశ్చిమ గోదావరి జిల్లా ప్రథమం .. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.

భీమవరం మే 12( శ్రీచక్ర )2024 -25 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల ఉన్నతి రుణాలు మంజూరు రూ.7.75 కోట్లు లక్ష్యం కాగా, రూ.8.32 కోట్లు రుణాలను మంజూరు చేయడమే కాకుండా రుణాల రికవరీ 99.91 శాతం సాధించినందుకు రాష్ట్రంలోనే పశ్చిమగోదావరి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. లక్ష్యానికి మించి రుణాల మంజూరు, రికవరీ బాగా చేయించడానికి కృషి చేసిన డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఎస్ఎస్ వేణుగోపాల్ ను అభినందిస్తూ, ఉన్నతి డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ టి.మురళీకృష్ణ కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. సోమవారం పీజిఆర్ఎస్ సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందించారు. భవిష్యత్తులో కూడా ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పడెలా విరివిగా రుణాలను అందజేసి వారి అభ్యున్నతికి కృషి చేయాలని ఈ సందర్భంగా తెలిపారు. ఉన్నతి రుణాల మంజూరులో జిల్లా అవార్డును సాధించడానికి తోడ్పాటును అందించిన ఎపిఎంలు, సీసీలు, వివోఏ లు, ప్రాజెక్ట్ సిబ్బంది అందర్నీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంలో డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, తదితరులు ఉన్నారు.



# ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవలు ఆదర్శం.

## పలువురు నర్సులకు సన్మానం





రామచంద్రాపురం, మే 12( శ్రీచక్ర)ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్న నర్సులు సేవలు వెలకట్టలేని మంత్రి తండ్రి సత్యం అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా రామచంద్రపురంలో ఏరియా ఆసుపత్రి నందు పనిచేస్తున్న నర్సులను ఆయన ఆసుపత్రి సూపర్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ ప్రవీణ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ నర్సుల ఆరాధ్య దైవం 'ఫ్లోరెన్స్ నైటింగేల్ ' జన్మదినం సందర్భంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. లేడీ విత్ ది లాంప్ గా పేరు గాంచిన "ఫ్లోరెన్స్ నైటింగేల్" సేవలు నేటితరం నర్సులు అందరికీ ఆదర్శనీయమని, రోగుల ఆరోగ్య పరిరక్షణలో మీ సహకారం మరువలేనిదన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల నర్సులు ప్రేమ,దయ, కరుణ, జాలి కలిగి ఉండాలన్నారు. అనంతరం పలువురు నర్సులను పూలమాలలు, దుస్సాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ చక్రధర్, నర్సింగ్ సూపరింటెండెంట్ జయప్రదలు మాట్లాడుతూ ప్రభుత్వం ఈ ఏడాది మా నర్సులు- మన భవిష్యత్తు అనే నినాదంతో వారి సంరక్షణ, ఆర్థికంగా బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుందున్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.తొలుత ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు : కార్మిక శాఖ మంత్రి సుభాష్



కాజులూరు,మే 12 ( శ్రీచక్ర) కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రిల్లోను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం కాజులూరు మండలం దుగ్గుదూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ. 50 లక్షలతో నూతనంగా నిర్మించనున్న బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవన నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు, వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం తొలి దశలో 168 బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్స్ మంజూరు చేసిందన్నారు. ఆ యూనిట్స్ నెలకొల్పడం ద్వారా గతం కంటే మెరుగ్గా అన్ని రకాల వైద్య, రక్త పరీక్షలు 24 గంటల లోపు అందుతాయి అన్నారు . గత కరోనా సమయంలో కొన్ని పరీక్షలు చేసేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఈ వైరాలజీ ల్యాబ్ ద్వారా సత్వర సేవలు, సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయన్నారు.అలాగే వైద్య రంగానికి కూటమి ప్రభుత్వం తగినన్ని నిధులు మంజూరు చేసిందన్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ సేవలను వినియోగించుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించు కోవాలని మంత్రి సుభాష్ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు డిఎంహెచ్వో ఆర్ రమేష్, ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వై సుప్రియ, డాక్టర్ జి. స్వాతి, పలువురు కూటమి పార్టీ నాయకులు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వినికిడి లోపం చిన్నారులకు ఉచిత ఉపకరణాలు పంపిణీ.కార్మిక శాఖ మంత్రి శుభాష్





రామచంద్రపురం,మే 12 (శ్రీచక్ర)వినికిడి లోపంతో ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఉచిత ఉపకరణాలను పంపిణీ చేశారు. సోమవారం రామచంద్రపురం రూరల్ మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో రామచంద్రపురం నియోజకవర్గంలోని భవితా కేంద్రాలలో విద్యను అభ్యసిస్తున్న పిల్లలకు ఆలింకో సంస్థ ద్వారా ఉచితంగా ఉపకరణాలను పంపిణీ చేసే కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. నియోజకవర్గంలో కే .గంగవరం ,రామచంద్రపురం మండలాల పరిధిలో సుమారు 46 మంది పిల్లలకు ఆలింకో, సమగ్ర శిక్ష ద్వారా వీల్ చైర్లు, ఎలక్ట్రిక్ మోపెట్ లు, బ్రెయిలీ కిట్లు, వినికిడి పరికరాలు తదితరాలను మంత్రి పిల్లలకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు అవసరమైన పరికరాలను అందజేసిన ఆ లింకో సంస్థకు ధన్యవాదాలు తెలిపారు.కూటమి ప్రభుత్వంలో సేవా సంస్థలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వంతు సహాయం అందించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి ప్రతి నెల 15 వేల రూపాయలు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద అందిస్తుందన్నారు. మరిన్ని సేవా సంస్థలు ముందుకు వచ్చి ప్రత్యేక అవసరాలు ఉన్న వ్యక్తుల కోసం మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రామచంద్రపురం మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, జనసేన ఇంచార్జి పోలిశెట్టి చంద్రశేఖర్,మేడిశెట్టి సూర్యనారాయణ ,మేడిశెట్టి శేషారావు , గౌరి శంకర్,ఎంపీడీవో పద్మజ్యోతి, ఎంఈఓలు వీర రాఘవరెడ్డి, నాగరాజు, అధికారులు ,ప్రజాప్రతినిధులు ,కూటమి శ్రేణులు,తదితరులు పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్ అర్జీలకు నిర్ణీత గడువులోపుగా నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలి

**సమస్య తమ శాఖ పరిధిలోనికి రాని పక్షంలో నిర్ణీత గడువు వరకు ఉంచకుండా వెంటనే సంబంధిత శాఖకు ఎండార్స్ చేయాలి .. జిల్లా కలెక్టర్ శ్రీమతి చదలవాడ నాగరాణి**





భీమవరం మే 12 (శ్రీచక్ర) సోమవారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరం నందు నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించడం జరిగిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులతో మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నదని, అధికారులు అంతకన్నా ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి ఫిర్యాదుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులు అర్థం చేసుకొని చక్కని పరిష్కారాన్ని చూపించాలని, పరిష్కారం కానీ సమస్యలు ఉంటే అర్జీదారునికి ఏ కారణం చేత సమస్యను పరిష్కారం చేయలేకపోతున్నామో అర్థమయ్యేలా వివరించాలన్నారు. పి జి ఆర్ ఎస్ ద్వారా 187 అర్జులను స్వీకరించగా వాటిలో కొన్ని ఈ విధంగా ఉన్నాయి.× పెంటపాడు మండలం ప్రత్తిపాడు శివారు పగులంపాడు గ్రామానికి చెందిన గజ్జరపు శంకరనారాయణ అర్జీని సమర్పిస్తూ నా ఇద్దరు కుమార్తెలు, నా భార్య నన్ను ఇంటి నుంచి గెంటేసారని, నేను ప్రస్తుతం ఉండ్రాజవరం వద్ద ఆశ్రమంలో డబ్బులు కట్టి ఉంటున్నానని, ఇప్పటివరకు నా మిత్రులు ఆశ్రమానికి డబ్బు కట్టారని, ప్రస్తుతం వారు కూడా డబ్బు కట్టలేమన్నారని, నా సమస్య గురించి తాడేపల్లిగూడెం ఆర్డీవో గారికి విన్నవించగా నాకు ఏ విధమైన న్యాయం జరగలేదన్నారు. డబ్బు కట్టకపోతే ఆశ్రమం నుండి బయటకు వెళ్లి పొమ్మంటున్నారని, కావున నాకు న్యాయం చేయాలని కోరారు. భీమవరంలోని బలుసుమూడికి చెందిన రమణ కాక్షాయిని దేవి అర్జీని సమర్పిస్తూ, తాను వికలాంగురాలునని (90 శాతం ఆర్థోపెటిక్) ప్రస్తుతం నెలకు 6 వేలు పింఛను పొందుతున్నానని, తాను నిలబడే పరిస్థితి లేదని వీల్ చైర్ కు మాత్రమే పరిమితమయ్యానని, ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నానని తనకు ప్రభుత్వం ఇచ్చే 15 వేల రూపాయలు పింఛన్ మంజూరు చేయాలని కోరారు. పెనుమంట్ర మండలం వెలగలవారిపాలెంకు చెందిన వేదాల రాంబాబు తనకు ముగ్గురు కుమారులని, తన రెండో కుమారుడైన వేదాల రమేష్ ములపర్రు గ్రామంలో నివాసం ఉంటున్నాడని, అతనికి ఒక కొడుకు, కుమార్తె ఉన్నారని వారి ఉన్నత చదువుల కోసం నా పెద్ద కుమారుడు, మూడో కుమారుడు నుండి 20 లక్షల రూపాయలు ఇప్పించానని, అంతేకాకుండా ఒక ఎకరం పొలం కూడా అతనికి రిజిస్టర్ చేయడం జరిగిందని, అప్పటినుండి నా యోగక్షేమాలు పట్టించుకోవడం లేదన్నారు. వాడి సోదరులకు డబ్బు తిరిగి ఇవ్వకుండా, నా యోగక్షేమాలు పట్టించుకోకుండా తప్పించుకు తిరుగుతున్నాడని, కావున నా కుమారుడు రమేష్ పై చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయవలసిందిగా అర్జీని సమర్పించారు.భీమవరం మండలం, గొల్లవానితిప్ప గ్రామస్తుడు నవ్వుంద్రు రాజేంద్రప్రసాద్ అర్జీని సమర్పిస్తూ, తనకు భీమవరం పట్టణంలో 150 గజాల స్థలం ఉందని దానిలో ఇల్లు నిర్మించుకోవాలనుకుంటున్నానని, బ్యాంకు లోనుకు దరఖాస్తు చేసుకోగా మున్సిపాలిటీ వారి నుండి ప్లాన్ కావాలన్నారు. దీనిపై మున్సిపాలిటీని సంప్రదించగా స్వీయ ధృవీకరణ సరిపోతుందని ఫ్లెక్సీలు పెట్టారన్నారు. ప్లాను ఇవ్వకపోతే బ్యాంకు రుణం మంజూరు కాదని, కావున దయచేసి మున్సిపాలిటీ వారు బ్లూ ప్రింట్ ప్లాన్ ఇచ్చే విధంగా మున్సిపాలిటీకి ఆదేశాలు ఇవ్వాల్సిందిగా కోరారు. భీమవరానికి చెందిన ఆకుల రమేష్ అర్జీ సమర్పిస్తూ భీమవరం రూరల్ మండలం దిరుసుమర్రు గ్రామపంచాయతీ అవినీతికి చిరునామాగా మారిందని, అధికారులు, ఉద్యోగులు అంతా ఏకమై నిధులు దుర్వినియోగం చేస్తున్నారని, కార్యదర్శి ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తున్నారని, పంచాయతీ నిధులు నేరుగా తన సొంత అకౌంట్ కి బదిలీ చేసుకుంటున్నారని, 2019 నుండి 2025 ఏప్రిల్ వరకు అధికారులతో పూర్తిస్థాయి విచారణ జరిపించి దోషుల పై చట్టపరమైన తీసుకోవాలని కోరారు. భీమవరం మండలం యనమదుర్రు గ్రామపంచాయతీ డేగాపురం ఏరియా రైతులు అర్జీ సమర్పిస్తూ, మా పంట పొలాలకు నీరు వెళ్ళుటకు మరియు ఉమ్మడి పుంత మార్గం ఉందని, కొంతమంది బోది ఆక్రమించుకుని చెత్తా చెదారంతో పూడ్చి వేయడం, బోధిలో మురికి నీటిని వదలడం వల్ల పంట నీరు కలుషితం అవుతోందని, కావున పూర్వం నుండి ఉన్న పుంతను సర్వే చేయించి రైతులకు ఇబ్బంది లేకుండా చూసి తమకు న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మొగలి వెంకటేశ్వర్లు, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, పి జి ఆర్ ఎస్ నోడల్ అధికారి వై.దోసిరెడ్డి, వయోవృద్ధుల ట్రిబ్యునల్ మెంబర్ మేళం దుర్గా ప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పల్లెల్లో రహదారులకు మహర్దశ కార్మిక శాఖ మంత్రి సుభాష్





రామచంద్రపురం,మే 12 (శ్రీచక్ర)పల్లెల్లో రహదారులకు మహర్దశ పట్ట నున్నదని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాశంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారంరామచంద్రపురం మండలం ఆదివారపు పేట గ్రామంలో తాళ్లపొలం ఆర్ అండ్ బి రోడ్డు నుండి ఆదివారం పేట గ్రామం వరకు ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ నిధుల నుండి కోటి రూపాయల అంచనా వ్యయంతో తలపెట్టిన రహదారికి ఆయన భూమి పూజ చేసి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో నిర్లక్ష్యానికి గురైన రహదారులు పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే పలు రహదారులు నిర్మాణం కోసం భూమి పూజలు చేయడం జరిగిందని కూటమి ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా తగిన ప్రాధాన్యతనిస్తూ రోడ్డు నిర్మాణాలను చేపడుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలో చేసిన అభివృద్ధి గత వైకాపా ప్రభుత్వం ఐదు సంవత్సరాలు కాలంలో చేయలేకపోయిందని జూన్ 4 వ తారీఖున ఈ సంవత్సర కాలంలో చేసిన అభివృద్ధి ని సగర్వంగా తెలియజేస్తానని మంత్రి సుభాష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ యేసు రత్నం, ఎంపీడీవో పద్మజ్యోతి, కూటమి నాయకులు పోలిశెట్టి చంద్రశేఖర్, మేడిశెట్టి సూర్యనారాయణ, మేడిశెట్టి శేషారావు, గౌరీ శంకర్, సర్పంచ్ దొరబాబు, అధికారులు ప్రజా ప్రతినిధులు కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా రెడ్ క్రాస్ సేవలకు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి అభినందనలు...... జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



భీమవరం మే 12 (శ్రీచక్ర )జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి రెడ్ క్రాస్ గోల్డ్ మెడల్ అందుకున్న సందర్భంగాసోమవారం పీజిఆర్ఎస్ సమావేశ మందిరం నందు జిల్లా అధికారులుపుష్పగుచ్చాలతో అభినందనలు తెలిపారు. ఈ సందర్భంలో జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు తొలుత జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి పుష్ప గుచ్చాన్ని అందజేసి, మాట్లాడుతూ జిల్లాలో 2024 - 25 సంవత్సరం లో రూ.36 లక్షలు వివిధ శాఖలు సభ్యత్వ రుసుము ద్వారా అందజేయడం జరిగిందని, వినూత్నంగా ప్రభుత్వ శాఖలచే రక్తదాన శిబిరాలు ఏర్పాటు, రూ.3 కోట్లతో బ్లడ్ బ్యాంక్, డేకేర్ తలసేమియా సెంటర్ ఏర్పాటు తదితర రెడ్ క్రాస్ సేవలలో పాలుపంచుకున్నందుకు జిల్లా గోల్డ్ మెడల్ ను సాధించడం జరిగింద న్నారు.ఈకార్యక్రమాలన్నింటినీ ముందుండి నడిపించిన మన జిల్లా కలెక్టర్ చదలవాడనాగరాణి అభినందనీయులన్నారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి పర్యవేక్షణ లో జిల్లా రెడ్ క్రాస్ కు సేవలందిస్తున్న జిల్లా, డివిజన్, మండల అధికారులు, రెడ్ క్రాస్ సభ్యుల సమిష్టి కృషితో జిల్లాకు గోల్డ్ మెడల్ ను సాధించడం జరిగిందని, ఇది వారందరి విజయం అన్నారు. అత్యధిక రెడ్ క్రాస్ సభ్యత్వం రుసుము డిఆర్డిఏ రూ.5,22,531, జిల్లా గ్రామపంచాయతీ రూ.4,26,250, భీమవరం తహసిల్దార్ రూ.2,71500, పరిశ్రమల శాఖ రూ.2,41,000, తాడేపల్లిగూడెం తహసిల్దార్ రూ.2,00,100 వసూలు చేసినందుకు ఆయా శాఖల అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. వీరితోపాటు 37 శాఖలు రెండు లక్షల రూపాయలు లోపు సభ్యత్వ రుసుమును వసూలు చేయడం జరిగిందని తెలిపారు. అలాగే ఏ జిల్లాలో లేని విధంగా వినూత్నంగా ప్రతి శాఖచే ప్రతి నెల మొదటి, మూడవ శుక్రవారం రెండు బ్లడ్ బ్యాంక్ క్యాంపులను నిర్వహించడం జరుగుచున్నదన్నారు. ప్రమాదాలు, గర్భిణీ స్త్రీలు, తలసేమియా బాధితుల అవసరాల కోసం ప్రతి ఏడాది 25వేల యూనిట్లు రక్తం అవసరం కాగా 19 వేల యూనిట్లు మాత్రమే సిద్ధం చేయగలిగామన్నారు. ప్రతినెల 3 వేల యూనిట్లు నుండి 6 వేల యూనిట్ల రక్త సేకరణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో సంభవించిన వరదలు సమయంలో రెడ్ క్రాస్, సత్య సాయి సేవలు ప్రశంసించ దగినవన్నారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని జిల్లా, డివిజన్, మండల అధికారులను జిల్లా కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి శివన్నారాయణ రెడ్డి, డి ఆర్ డి ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎమ్మెస్ ఎస్ వేణుగోపాల్, ఐసీడీఎస్ పిడి బి సుజాత రాణి, గ్రామ వార్డు సచివాలయాల అధికారి వై.దోసిరెడ్డి, డిఎంహెచ్వో డాక్టర్ జి.గీతా బాయి, డిఇఓ ఇ.నారాయణ, ఏపీసి శ్యాంసుందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉన్నారు

## భీమేశ్వరుని సన్నిధిలో సీఎం కార్యదర్శి కార్తికేయ మిశ్రా





రామచంద్రపురం, మే 12 (శ్రీచక్ర)ఆంధ్రప్రదేశ్ సీఎం సెక్రటరీ ఐఏఎస్ అధికారి కార్తికేయ మిశ్రా శ్రీ మాణిక్యంబ సమేత శ్రీ భీమేశ్వర స్వామిని దర్శించుకున్నారు . ఏమి అరకు సోమవారం ఆయనకు దేవాలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారిణి అల్లు వెంకట దుర్గ భవాని ,ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా వేద పండితులు ఆశీర్వచనం చేసి తీర్థం ప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమం లో ఆయన వెంట రామచంద్రపురం ఆర్డీవో దేవరకొండ అఖిల , ఎమ్మార్వో బి. మృత్యుంజయ రావు ద్రాక్షారామం ఎస్ఐ లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ ఈ గవర్నన్స్ వాట్సప్ సేవలకు విస్తృత ప్రచారం కల్పించాలి. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.

భీమవరం మే 12 శ్రీచక్ర రాష్ట్ర గ్రామ వార్డు సచివాలయాల శాఖ ఈ గవర్నన్స్ వాట్సప్ సేవలు విస్తృత అవగాహనకు రూపొందించిన మనమిత్ర స్టాండిలను సోమవారం కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఈ గవర్నన్స్ వాట్సప్ సేవలు అంటే ఏమిటి, ఏ విధంగా సద్వినియోగం చేసుకోవచ్చు, ప్రయోజనాలేంటి, తదితర విషయాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని జిల్లా గ్రామ,వార్డు సచివాలయాల అధికారి వై.దోసిరెడ్డి ని ఆదేశించారు. జిల్లాలోని 535 గ్రామ, వార్డు సచివాలయాలకు, ఎంపీడీవో కార్యాలయాలకు, మున్సిపాలిటీలకు "మనమిత్ర" స్టాండిలను అందజేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు స్పష్టంగా కనిపించేలా "మనమిత్ర" స్టాండిలను ప్రదర్శించాలని ఆదేశించారు. మనమిత్ర స్టాండ్లను జిల్లాలోని అన్ని ప్రభుత్వ జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకో నున్నటు ఈ సందర్భంలో జిల్లా గ్రామ, వార్డు సచివా లయాల అధికారి వై. దోసి రెడ్డి, జిల్లా టూరిజం అధికారి ఏ.వీ అప్పారావు ఉన్నారు.



# స్పోర్ట్స్ న్యూస్

## మైండ్‌సెట్‌ను మార్చిన కింగ్.. టెస్టుల్లో ముగిసిన కోహ్లీ శకం



హైదరాబాద్: టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విరాట్ కోహ్లీ.. ఆ ఫార్మాట్‌లో అనితరసాధ్యుడు అనిపించుకున్నాడు. సంప్రదాయ క్రికెటర్ల తరహాలో కాకుండా.. చాలా ధైర్యవంతుడి తరహాలో అతను టెస్టు క్రికెట్‌ను ఆడాడు. సచిన్ టెండూల్కర్ తర్వాత ఇండియన్ క్రికెట్‌లో ప్రభావంతమైన బ్యాటర్‌గా కింగ్ కోహ్లీ పేరు తెచ్చుకున్నాడు. భారత జట్టు టెస్టు పోకడనే మార్చేశాడతను. భారతీయ క్రికెటర్ల సైకాలజీపై ప్రభావాన్ని చూపిన క్రికెటర్‌గా కోహ్లీ నిలుస్తాడు. దశాబ్ద కాలంలో అతను కేవలం పరుగులు మాత్రమే పారించలేదు.. క్రికెట్ అభిమానుల్లో అతను ఆశల్ని పెంచాడు. బ్యాటింగ్‌లో సంప్రదాయ విధానాలను సవాల్ చేశాడు. కొత్త తరహా టీమిండియాను తయారు చేయడంలో సఫలం అయ్యాడు. టెస్టు ఫార్మాట్‌ను విరాట్ వీడడం అది జట్టుకు కొంత లోటే. బ్యాటింగ్ సగటుతో దుమ్మురేపిన కోహ్లీ లాంటి మరో బ్యాటర్ టెస్టుల్లో ఎవరూ లేరని చెప్పవచ్చు. నిజానికి ఒకప్పుడు భారత క్రికెటర్లు ఎక్కువగా టెక్నికల్ స్కిల్‌తో మాత్రమే ఆడేవారు. సైకాలజీ విషయానికి వస్తే వారిలో కొంత ఆత్మనూన్యత ఉండేది. కానీ కోహ్లీ ఎంట్రీతో టెస్టు క్రికెట్‌లో ఇండియన్ గేమ్ స్టయిల్ మారిపోయింది. గంగూలీ, ధోనీ కెప్టెన్లుగా తమదైన స్టయిల్‌లో రాణించగా.. కోహ్లీ మాత్రం అగ్నిశిఖలాగా భారతీయ టెస్టు క్రికెట్‌లో జోష్‌ను పెంచేశాడు. విదేశీ పిచ్‌లపై విరుచుకుపడే ఆటను అతను ప్రదర్శించాడు. విదేశీ గడ్డలపై కూడా ఈజీగా గెలవవచ్చు అని నిరూపించాడు. దేన్నీ వదిలేది లేదన్న స్టయిల్‌లో అతను గ్రౌండ్‌లో ఆడేవాడు. ఇంకా ఇంకా కావాలన్న కసితో అతను పర్ఫార్మ్ చేసేవాడు. కోహ్లీ కెరీర్‌ను రెండు సిరీస్‌లు మార్చేశాయి. అతని క్యారెక్టర్ ఏంటో కూడా ఆ సిరీస్‌ల్లో తెలిసిపోయింది. ఇంగ్లండ్, ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌లో కోహ్లీ ఓ కొత్త తేజంలా మెరిశాడు. క్రికెట్‌లో ధీటైన ఆ రెండు జట్లకు టఫ్ ఫైట్ ఇచ్చాడతను. 2014 సిరీస్‌లో ఇంగ్లండ్ బౌలర్ అండర్సన్ తన లేట్ స్వింగ్‌తో కోహ్లీని ఇబ్బందిపెట్టాడు. వాస్తవానికి ఆ సీజన్‌లో కోహ్లీ ఫెయిల్ అయ్యాడు. కానీ ఆ తర్వాత అతను బలోపేతం అయ్యాడు. టెక్నికల్ లోపాలను సరిదిద్దుకుని మళ్లీ రాణించాడు. బెస్ట్ బ్యాటర్‌గానే కాకుండా బెటర్ బ్యాటర్‌గా ఎదిగాడు. 2018లో జరిగిన టెస్టు సిరీస్‌లో అతను దుమ్మురేపాడు. ఎడ్జ్‌బెస్టన్‌లో జరిగిన టెస్టులో 149 రన్స్ స్కోర్ చేశాడు. సహనాన్ని పెంచుకున్నాడు, తన నైపుణ్య విద్యలను ప్రదర్శించాడు. ఆ సిరీస్‌లో అతను 5 టస్టుల్లో 59 సగటుతో మొత్తం 593 రన్స్ చేశాడు. ఇంగ్లండ్‌తో సిరీస్ ముగిసిన తర్వాత ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్‌లోనూ కోహ్లీ చెలరేగిపోయాడు. ఆస్ట్రేలియాలో అప్పటి వరకు ఇండియా టెస్టు సిరీస్ నెగ్గలేదు. కానీ కోహ్లీ ఆ రికార్డును చెరిపేశాడు. ఆ సిరీస్‌లో నిజానికి పూజారా హీరో అయినా.. పెర్త్ మ్యాచ్‌లో మాత్రం కోహ్లీ 123 రన్స్ చేశాడు. ఆ సిరీస్‌ను ఇండియా 2-1 తేడాతో సొంతం చేసుకున్నది. అప్పటి వరకు ఆత్మనూన్యతలో ఉన్న ఇండియన్ క్రికెట్ ఒక్కసారిగా విరోచిత బాటను అందుకున్నది. విదేశీ పిచ్‌లపై ఇండియాను ఆధిపత్య పథంలో నడిపాడు కోహ్లీ. సచిన్ తర్వాత విదేశీ పిచ్‌లపై రాణించిన మేటి బ్యాటర్‌గా కోహ్లీ అగ్రపథంలో ఉన్నాడు. వివిధ దశల్లో కోహ్లీ తన సత్తాను చాటిన తీరు కూడా హైలెట్. 2014 అడిలైడ్ టెస్టుల్లో 141 రన్స్, 2018 సెంచరీయిన్‌లో 153 రన్స్, 2016 వెస్టిండీస్‌లో 200 రన్స్, దక్షిణాఫ్రికాతో 254 నాటౌట్ ఇన్నింగ్స్‌లు.. కోహ్లీ టెస్టు కెరీర్‌లో ప్రత్యేకమైనవి. బలమైన షాట్లు ఆడడమే కాదు.. వాటిని టైమింగ్‌లో కొట్టేవాడు. బరువైన బ్యాట్లు కాదు.. స్ట్రయిట్ డ్రైవ్‌లతో అలరించేవాడు. పెద్దగా ఇన్నోవేటివ్ స్ట్రోక్స్ ఏమీ ఆడలేదు. స్కూప్‌లు, రివర్స్ స్వీప్‌లు ఎక్కువగా లేదు. క్లాసికల్ క్రికెట్ బ్యాటింగ్‌ను.. విరాట్ విరోచిత శైలిలో ఆడేవాడు. ప్రొఫెషనల్ క్రికెట్‌కు ప్రత్యామ్నాయంగా కోహ్లీ నిలిచాడు. శారీరకంగా అతను ఫిట్‌నెస్ అందర్నీ స్టన్ చేసింది. మానసికంగా కూడా అతను ఓ ఇనుప ఖనిజం అన్న రీతిలో మైదానంలో ఉండేవాడు. ఇండియన్ టెస్టు క్రికెట్‌లో సచిన్ టెండూల్కర్ ఓ జీనియస్, ధోనీ ఓ వ్యూహకర్త, ఆ రేంజ్‌లోనే కోహ్లీ భారతీయ క్రికెట్ చరిత్రలో అత్యంత ప్రభావంతమైన బ్యాటర్‌గా నిలిచిపోయాడు. క్రికెట్ ఫలితాలనే కాదు.. క్రికెటర్ల మైండ్‌సెట్‌ను కూడా అతను మార్చేశాడు. టెస్టుల్లో అతను 9 వేల రన్స్ చేశాడు. 30 సెంచరీలు ఉన్నాయి. ఆ రికార్డుతో టెస్టులకు గుడ్‌బై చెప్పాడు కోహ్లీ. అతని గుండె ధైర్యం, పరుగుల దాహం, పట్టువదలని క్రీడా స్ఫూర్తి .. కోహ్లీకి ప్రత్యేకమైనవి. కోహ్లీ నిజంగా కింగే. హుందాగా ఆడుతూనే అతను ఆ ఫార్మాట్‌ను డామినేట్ చేసిన తీరు.. క్రికెట్ హిస్టరీలోనే ఓ కొత్త అధ్యాయంగా నిలిచిపోతుంది.

## టెస్టు క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన విరాట్ కోహ్లీ.. సోషల్ మీడియాలో భావోద్వేగ పోస్టు



హైదరాబాద్: డ్యాషింగ్ బ్యాటర్ విరాట్ కోహ్లీ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ నేపథ్యంలో అతను ఇన్‌స్టా అకౌంట్‌లో ఓ భావోద్వేగపూరిత పోస్టును పెట్టాడు. టెస్టు క్రికెట్‌లో దేశం తరపున అరంగేట్రం చేసి 14 ఏళ్లు అవుతున్నట్లు కోహ్లీ తన పోస్టులో తెలిపాడు. టెస్టు ఫార్మాట్ తనకు ఎంతో నేర్పిందని, తనను పరీక్షించిందని, తతను తీర్చిదిద్దిందని, జీవితానికి కావాల్సిన ఎన్నో పాఠాలు నేర్పినట్లు కోహ్లీ పేర్కొన్నాడు. తెలుపు రంగు దుస్తుల్లో ఆడడం ఎంతో ప్రత్యేకంగా ఉంటుందన్నారు. టెస్టు ఫార్మాట్‌ను వీడడం సులువైన అంశం కాదు అని, కానీ సరైన సమయం అని, ఆ ఫార్మాట్ ఎంతో చేశానని, తనకు కూడా ఎంతో కలిసి వచ్చిందన్నారు. ఊహించినదాని కన్నా ఎక్కువే లాభం జరిగిందన్నాడు. కోహ్లీ 123 టెస్టు మ్యాచ్‌లు ఆడాడు. 68 మ్యాచ్‌లకు అతను కెప్టెన్‌గా చేశాడు. బ్యాటింగ్ సగటు 46.85తో అతను 9230 రన్స్ చేశాడు. జూన్‌లో ఇంగ్లండ్‌తో అయిదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభంకానున్న నేపథ్యంలో కోహ్లీ తన నిర్ణయాన్ని వెల్లడించారు. గత కొన్ని రోజుల నుంచి కోహ్లీ టెస్టు రిటైర్మెంట్‌పై చర్చ జరుగుతోంది. రోహిత్ తరహాలోనే టెస్టు నుంచి తప్పుకునేందుకు కోహ్లీ సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వ్యాపించాయి. అయితే తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని కోహ్లీ.. బీసీసీఐకి చెప్పినట్లు కూడా తెలుస్తోంది. వాస్తవానికి టెస్టు ఫార్మాట్‌లో కోహ్లీ పెద్దగా ఫామ్‌లో లేడు. ఇటీవల ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్ పెర్త్ మ్యాచ్‌లో కోహ్లీ సెంచరీ కొట్టాడు. సుమారు ఏడాది గ్యాప్ తర్వాత అతను ఆ ఇన్నింగ్స్ ఆడాడు. ఓ దశలో టెస్టుల్లో కోహ్లీ యావరేజ్ టాప్‌గా ఉండేది. టాప్ ఫామ్‌లో ఉన్న సమయంలో కోహ్లీ టెస్టు యావరేజ్ 55.10గా ఉంది. కానీ గత 24 నెలల్లో అతను టెస్టు యావరేజ్ 32.56కు పడిపోయింది. అనుభవం దృష్ట్యా.. ఇంగ్లండ్ టూరుకు అవసరం ఉన్నా.. కోహ్లీ తనంతటే తానే తప్పుకుంటున్నట్లు తెలుస్తోంది. టెస్టుల్లో కోహ్లీ 30 సెంచరీలు, 31 హాఫ్ సెంచరీలు చేశాడు.

## మళ్లీ ప్రాక్టీస్ మొదలుపెట్టిన గుజరాత్ టైటాన్స్..!



భారత్-పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ అవగాహన నేపథ్యంలో గుజరాత్ టైటాన్స్ జట్టు శిక్షణను ప్రారంభించింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత పరిస్థితులు ఉద్రిక్తత మారిన నేపథ్యంలో ఐపీఎల్ పరిపాలన టోర్నీని వారం పాయిటు వాయిదా వేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం పరిస్థితులు సద్దుమణుగుతున్న నేపథ్యంలో టోర్నీ పునః ప్రారంభంపై చర్చలు జరిగాయి. ఈ నెల 16న లక్నో సూపర్ జెయింట్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మ్యాచ్‌తో టోర్నీ ప్రారంభం కానున్నంది. ఇక గుజరాత్ జట్టు ఇంకా మూడు మ్యాచులు ఆడాల్సి ఉంది. ఢిల్లీ, ముంబయి, చెన్నైతో కీలక మ్యాచులున్నాయి. ఈ మూడు మ్యాచుల్లోనూ రాణించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలువాలని ఆశిస్తున్నది. గుజరాత్ ఇప్పటి వరకు ఆడిన 11 మ్యాచుల్లో ఎనిమిదింట్లో గెలిచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. ఈ క్రమంలో అదే ఊపుతో మరోసారి చాంపియన్‌గా నిలువాలని భావిస్తుంది. గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ (ఉఅం) ఆటగాళ్లకు మూడు గంటలకుపైగా జట్టు ప్రాక్టీస్‌లో పాల్గొన్నట్లు తెలిపింది. సస్పెన్షన్ కారణంగా సీజన్‌లో కొన్ని మ్యాచులకు దూరమైన కగిసో రబాడ మళ్లీ జట్టుతో చేరాడు. రూథర్‌ఫోర్డ్, మహమ్మద్ సిరాజ్, కెప్టెన్ గిల్‌తో కలిసి నెట్స్‌లో తీవ్రంగా ప్రాక్టీస్ చేశాడు. ఇదిలా ఉండగా.. ఈ నెల 8న పంజాబ్ కింగ్స్-ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య మ్యాచ్ అర్ధాంతరంగా ముగిసిన విషయం తెలిసిందే. అయితే, ఈ మ్యాచ్ స్టేటస్‌ని బీసీసీఐ ఇప్పటి వరకు ప్రకటించలేదు. ఇరు జట్లకు ఎలాంటి పాయింట్లు కేటాయించలేదు. మ్యాచ్ తిరిగి ప్రారంభమైతే.. మళ్లీ నిర్వహిస్తారా? లేదంటే చెరో పాయింట్‌ను కేటాయిస్తారా? అన్నది తెలియలేదు. టోర్నీని లక్నో సూపర్ జెయింట్స్-రాయల్ చాలెంజర్స్ బెంగళూరు మ్యాచ్‌తోనే మొదలుపెట్టనున్నట్లు పలు నివేదికలు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో రెండు జట్లకు చెరో పాయింట్ ఇచ్చే అవకాశాలున్నాయి. బీసీసీఐ మళ్లీ షెడ్యూల్‌ని సవరించిన సమయంలో ఈ విషయంలో క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

## షాకింగ్ డెసిషన్ తీసుకున్న తాలిబన్ సర్కారు..! ఆఫ్ఘనిస్తాన్‌లో చెస్‌పై బ్యాన్..

తాలిబన్ ప్రభుత్వం షాకింగ్ నిర్ణయం తీసుకున్నది. తమ దేశంలో చెస్ ఆడడంపై నిషేధం విధించింది. ఇప్పటికే పలు రకాల క్రీడలను వ్యతిరేకించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆఫ్ఘనిస్తాన్‌లోని ఖామా ప్రెస్ ఈ విషయాన్ని వెల్లడించింది. మే ఒకటి నుంచి చెస్‌ని నిలిపివేస్తున్నట్లు క్రీడా మంత్రిత్వ శాఖ అధికారులు ధ్రువీకరించింది. గత సంవత్సరం ప్రభుత్వం ప్రకటించిన ధర్మ ప్రచారం, దుర్మార్గ నివారణ చట్టం కింద బ్యాన్ విధిస్తున్నట్లు స్పోర్ట్స్ డైరెక్టరేట్ ప్రతినిధి అటల్ మష్వానీ పేర్కొన్నారు. చెస్ జూదానికి మూలంగా పరిగణిస్తున్నామని.. ఇస్లామిక్ చట్టాలకు అనుగుణంగా ఉందో లేదో నిర్ధారించే వరకు నిషేధం అమలులో ఉంటుందని పేర్కొన్నారు. అప్పటి వరకు చెస్ సంబంధిత కార్యకలాపాలు ప్రారంభించేందుకు అనుమతి ఉండదని స్పష్టం చేసింది. తాలిబన్ల ధర్మం ప్రచారం, దుర్మాగ నివారణ మంత్రిత్వ శాఖ సైతం ఆఫ్ఘనిస్తాన్ చెస్ సమాఖ్యను రద్దు చేసింది.. ఇస్లామిక్ చట్టం చెస్‌ను 'హరామ్' (నిషిద్ధం)గా ప్రకటించిందని ఖామా ప్రెస్ నివేదించింది. ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్లు అధికారాన్ని చేజిక్కించుకున్నప్పటి నుంచి సాంస్కృతిక, సామాజిక, క్రీడా కార్యక్రమాలపై ఆంక్షలు పెరుగుతున్నాయి. తాలిబన్ నిషేధం ప్రకటనకు ముందు అనేక మంది చెస్ ఆటగాళ్లు, చెస్ సమాఖ్య అధికారులు తమ కార్యకలాపాలను కొనసాగించేందుకు తాలిబన్ నేతృత్వంలోని క్రీడా మంత్రిత్వ శాఖ నుంచి అనుమతి, ఆర్థిక సహాయాన్ని అభ్యర్థించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే తాలిబన్ సర్కారు వారి ఆశలపై నీళ్లు చల్లుతూ.. నిషేధం విధించింది. ఇటీవల ఆఫ్ఘనిస్తాన్‌లో సాంస్కృతిక, వినోద కార్యకలాపాలను



పరిమితం చేయడానికి వారి వ్యూహాన్ని చూపిస్తుంది. తాలిబన్లు ఇప్పటికే ఆఫ్ఘనిస్తాన్‌లో మహిళలపై అనేక ఆంక్షలు విధించారు. ఈ విధానాలు ఎంతకాలం కొనసాగుతాయో చూడాల్సిందే. అయితే, తాలిబన్ సర్కారు నిర్ణయాలపై అంతర్జాతీయ సమాజం నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి తెస్తుందా? లేదా చూడాల్సిందే. ఇదిలా ఉండగా.. ఫిబ్రవరిలో విద్యార్థులకు కొత్త యూనిఫారం తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులు బ్లూ కలర్ చొక్కాలు, ప్యాంటు, తెల్లటి టోపీలు ధరించాలని చెప్పింది. 10 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు తెల్ల చొక్కాలు, ప్యాంటు, తెల్లటి తలపాగాలు ధరించాలని చెప్పింది. ఆరో తరగతి వరకు విద్యార్థులకు బ్లాక్ కలర్ డ్రెస్ ధరించాలని ఆదేశించింది. ఆఫ్ఘనిస్తాన్‌లో అధికారం చేజిక్కించుకున్నప్పటి నుంచి తాలిబన్లు ఆరో తరగతి కంటే ఎక్కువ చదువుకోవడాన్ని తాలిబన్లు నిషేధించారు. విశ్వవిద్యాలయాలు, వైద్య విద్య అందకుండా చేసింది. అలాగే, మహిళలు క్రీడలు ఆడకూడదంటూ బ్యాన్ చేసిన విషయం తెలిసిందే.

## టెస్ట్ కెప్టెన్సీ రేసు నుంచి తప్పుకున్న జస్ప్రీత్ బుమ్రా..!

### ఆ ఇద్దరిలో ఒకరికి కెప్టెన్సీ.. మరొకరు వైస్ కెప్టెన్..!



టెస్టులకు రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించిన నేపథ్యంలో కొత్త సారథి ఎవరు ? అన్న చర్చ సాగుతున్నది. వచ్చే నెల నుంచి ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌లో టీమిండియా పాల్గొనున్నది. ఈ పర్యటన కోసం బీసీసీఐ ఈ నెలలోనే జట్టును ఎంపిక చేయాల్సి ఉంది. కొత్త కెప్టెన్ ఎవరనే దానిపై ఇప్పటి వరకు ఓ స్పష్టత రాలేదని తెలుస్తున్నది. కెప్టెన్ రేసులో యువ బ్యాట్స్‌మెన్ శుభ్‌మన్ గిల్, స్టార్ వికెట్ కీపర్ రిషబ్ పంత్, ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా మధ్య విపరీతమైన పోటీ ఉన్నది. అయితే, టెస్ట్ కెప్టెన్సీ రేసు నుంచి బుమ్రా తప్పుకున్నట్టు ఓ మీడియా నివేదిక తెలిపింది. ఇక కెప్టెన్సీ రేసు గిల్-పంత్ మధ్యనే ఉందని పేర్కొంది. టెస్ట్ కెప్టెన్సీ బుమ్రా పేరు సైతం గట్టిగానే వినిపించింది. కానీ, పనిభారం కారణంగా ఐదు మ్యాచుల సుదీర్ఘ టెస్ట్ సిరీస్‌లోని అన్ని మ్యాచులు ఆడుతానని హామీ ఇవ్వలేనని సెలెక్టర్లకు చెప్పాడని ఓ స్పోర్ట్స్ వెబ్‌సైట్ తెలిపింది. ఈ పరిస్థితిలో సెలెక్టర్లు సిరీస్ అంతా నిలకడగా రాణించే ఆటగాడికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పింది. బుమ్రా స్వయంగా కెప్టెన్సీ రేసు నుంచి తప్పుకోవడంతో సెలెక్టర్లు ప్రసుతం శుభ్‌మన్ గిల్, పంత్‌లో ఎవరైనా ఒకరిని కెప్టెన్సీకి ఎంపిక చేయాలని భావిస్తున్నారు. ఇద్దరిలో ఎవరో ఒకరు కెప్టెన్ అయినా.. మరొకరిని వైస్ కెప్టెన్‌గా నియమించే అవకాశం ఉంది. ఇంగ్లాండ్ సిరీస్ కోసం భారత జట్టును ఈ నెల 24లోగా ప్రకటించే అవకాశం ఉంది. రాబోయే ఇంగ్లాండ్ సిరీస్‌కు ముందు టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకోవాలని విరాట్ కోహ్లీ భారత క్రికెట్ నియంత్రణ బోర్డు (ఃఅఅఎ)కి చెప్పినట్లుగా 'స్కైస్పోర్ట్స్ న్యూస్' పేర్కొంది. అయితే, దీనిపై బీసీసీఐ ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. అదే సమయంలో బీసీసీఐ వర్గాలు ఈ వార్తలను ఖండించనూ లేదు. జూన్‌లో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్ ప్రారంభానికి ముందే తాను టెస్టుల నుంచి రిటైర్ కావాలని భావిస్తున్నట్లు విరాట్ ఏప్రిల్‌లోనే చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌తో చెప్పినట్లు తెలిసింది. అగార్కర్, బీసీసీఐకి చెందిన ఓ అధికారి మరోసారి కోహ్లీతో సమావేశం కావాలని భావిస్తున్నారు. కోహ్లీ తన నిర్ణయాన్ని పునః పరిశీలించాలని కోరినట్లుగా పలు నివేదికలు తెలిపాయి. అయితే, ఇప్పటి వరకు మళ్లీ తన నిర్ణయాన్ని కోహ్లీ వెల్లడించలేదని సమాచారం.

## టెస్టుల నుంచి కోహ్లీ రిటైర్.. గంభీర్ అదిరిపోయే రియాక్షన్

ముంబై: ఇండియన్ క్రికెట్ అభిమానులకు కింగ్ విరాట్ కోహ్లీ షాకింగ్ న్యూస్ అందించాడు. టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అవుతున్నట్లు కోహ్లీ ప్రకటించాడు. కోహ్లీ తీసుకున్న ఈ నిర్ణయం చాలా మందిని కలచి వేసింది. తమ అభిమాన క్రికెటర్‌ని ఇక వైట్ జెర్సీలో చూడలేమా అంటూ బాధపడ్డారు. మరికొందరు మాత్రం ఈ ఛాంపియన్ తీసుకున్న నిర్ణయాన్ని గౌరవించారు. అన్ని అభినందిన్తా.. సోషల్‌మీడియాలో ఎ ్ స్ట ల ు పెడుతున్నారు. తాజాగా టీం ఇండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌కూడా విరాట్ గురించి 'ఎక్స్'లో



పోస్ట్ చేశారు. 'సింహం లాంటి పాషన్ కలిన వ్యక్తి.. మిస్ య చీక్స్' అంటూ గంభీర్ పోస్ట్‌లో పేర్కొన్నారు. గంభీర్‌తో పాటు పలువు మాజీలు, విదేశీ క్రికెటర్లు కూడా విరాట్‌కు(ఎతితీజీబి ఐనీప్తశ్రీతి) రిటైర్‌మెంట్‌పై శుభాకాంక్షలు తెలిపారు. ఇక తన కెరీర్‌లో 123 టెస్టులు ఆడి 9,230 పరుగులు సాధించాడు. ఇందులో 30 శతకాలు, 31 అర్థశతకాలు ఉన్నాయి. టెస్టుల్లో విరాట్ వ్యక్తిగత అత్యధిక స్కోర్ 254 పరుగులు.

# డయాబెటిస్ బాధితులు కొబ్బరినీళ్ళు తాగొచ్చా.. లేదా?




డయాబెటిస్.. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది ఈ సమస్యతో బాధపడుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధి అయిన డయాబెటిస్ మన శరీరంలోని అన్ని ఆర్గాన్స్ పైన తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తుంది. డయాబెటిస్ బారిన పడినవారు జాగ్రత్త తీసుకోకుంటే తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కోవలసి వస్తుంది. డయాబెటిస్ బాధితులూ జాగ్రత్త ముఖ్యంగా డయాబెటిస్ బాధితులు దీర్ఘకాలంలో గుండెజబ్బులను, మూత్రపిండాల వ్యాధులను, నరాల సంబంధిత జబ్బులను, కంటి చూపు కోల్పోవడం వంటి సమస్యలను ఎదుర్కొంటారు. అందుకే డయాబెటిస్ బారిన పడినవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతారు. జీవనశైలి మార్చుకోవాల్సిన అవసరం ఉందని, ఆహారపు అలవాట్లు కూడా మార్చుకోవాలని చెపుతారు. డయాబెటిస్ బాధితులు కొబ్బరినీళ్ళు తాగొచ్చా? డయాబెటిస్ బారిన పడినవారు చాలామంది ఏది తినాలన్నా, ఏది తాగాలన్న విపరీతంగా భయపడతారు. కొంతమంది డయాబెటిస్ బాధితులు కొబ్బరినీళ్లు తాగాలన్న భయపడుతూ ఉంటారు. అసలు డయాబెటిస్ బాధితులు కొబ్బరి నీళ్లు తాగవచ్చా? తాగకూడదా అనేది ప్రస్తుతం తెలుసుకుందాం. డయాబెటిస్ బాధితులు కొబ్బరి నీళ్లు తాగవచ్చు. అయితే రోజుకు ఒకటి నుంచి రెండు కప్పులు కొబ్బరి నీళ్లు మాత్రమే తాగడం మంచిది అంతకంటే ఎక్కువ కొబ్బరి నీళ్లు డయాబెటిస్ బాధితులు తాగకూడదు. షుగర్ కంట్రోల్ లో లేనివాళ్ళు కొబ్బరినీళ్ళు తాగితే ఇది రక్తంలోని చక్కెర స్థాయిలను పెంచి డయాబెటిస్ ను నియంత్రణలో లేకుండా చేస్తుంది. కొబ్బరి నీళ్లు తక్కువ క్యాలరీల పానీయం అయినప్పటికీ టైప్ టు డయాబెటిస్ తో బాధపడే వారికి, రక్తంలో గ్లూకోజ్ నియంత్రణలో లేనివారికి కొబ్బరి నీళ్ళను ఎక్కువగా తాగడం మంచిది కాదని చెబుతారు.కొబ్బరినీళ్లు యాంటీ ఆక్సిడెంట్ లతో నిండి ఉండి, శరీరానికి హాని చేసే ఫ్రీ రాడికల్స్ నుంచి కాపాడటానికి సహాయ పడతాయి. కానీ డయాబెటిస్ బాధితులు మాత్రం వీటిని మితంగానే తీసుకుంటే మంచిది. ముఖ్యంగా కొబ్బరి నీళ్లలో పొటాషియం, మెగ్నీషియం మరియు ఎలక్ట్రోలైట్స్ వంటి పోషకాలు ఉంటాయి. కొబ్బరి నీళ్లలో ఉండే మంచి పోషకాలు అయిన ముఖ్యంగా పొటాషియం రక్తపోటు తగ్గటానికి దోహదం చేస్తుంది. గుండె జబ్బులను నియంత్రిస్తుంది. వ్యక్తి ఆరోగ్య స్థితి, తాగే క్వాంటిటీ ఆధారంగా షుగర్ లెవల్స్ శరీర రోగ నిరోధక వ్యవస్థను కొబ్బరి నీళ్లు మెరుగు పరుస్తాయి. అయినప్పటికీ కొబ్బరి నీళ్లను తాగే విషయంలో డయాబెటిస్ బాధితులు జాగ్రత్తగా ఉండాలి. మధుమేహం ఉన్న వారి విషయంలో వారు కొబ్బరి నీళ్లను తీసుకునే క్వాంటిటీ, వ్యక్తి యొక్క ఆరోగ్య స్థితి పైన ఆధారపడి పరిస్థితి ఉంటుంది. కొబ్బరి నీళ్లు మాత్రమే కాదు ఏ ఆహారం అయినా సరే డయాబెటిస్ బాధితులు మితంగా తీసుకుంటేనే మంచిది.

# ఆహారంలో ప్రోటీన్ లోపం ఉంటే శరీరంలో వచ్చే సమస్యలివే!

ఆరోగ్యంగా ఉండాలి అంటే తీసుకునే ఆహారం లోపల పోషకాలు ఉండాలి. ముఖ్యంగా ఆహారంలో తగినంత ప్రోటీన్ ఉండాలి ఆహారంలో తగినంత ప్రోటీన్ లేకపోతే శరీరంలో అనేక అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. ప్రోటీన్ లోపం వల్ల శరీరం ఎన్ని రకాల సమస్యలకు గురవుతుంది, ప్రోటీన్ లోపాన్ని నిర్లక్ష్యం చేస్తే ఏం జరుగుతుంది అనే అంశాలను ప్రస్తుతం తెలుసుకుందాం. ప్రోటీన్ లోపంతో అనారోగ్య సమస్యలు ప్రోటీన్ లోపం వల్ల అనేక సమస్యలు వస్తాయి. మనం తినే ఆహారంలో ఉండే ప్రోటీన్ మన శరీరానికి శక్తిని ఇస్తుంది. ఆకలి తగ్గిస్తుంది. తీసుకునే ఆహారంలో తగినంత ప్రోటీన్ లేకపోతే మీరు బలహీనంగా తయారవుతారు. ఏ చిన్న పని చేసిన అలసటకు గురవుతారు. ఇక ప్రోటీన్ లోపం కారణంగా ఎముకల బలం కూడా తగ్గిపోతుంది. చిన్నపాటి ఇబ్బందులకు కూడా ఎముకలు విరిగిపోవడం వంటి పరిణామాలు చోటు చేసుకుంటాయి. ప్రోటీన్ లోపంతో జరిగేదిదే ఆహారంలో తగినంత ప్రోటీన్ లేకపోతే విపరీతంగా జుట్టు రాలిపోతుంది. జుట్టు బలహీన పడుతుంది. కావలసినంత ప్రోటీన్ లేకపోతే చర్మ సమస్యలు వస్తాయి. చర్మం పొడిబారుతుంది. ప్రోటీన్ లోపం ఎక్కువగా ఉంటే వ్యాధి నిరోధక శక్తి తగ్గుతుంది. ఫలితంగా తరచూ అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉంటుంది. ఇక పిల్లలలో కూడా ప్రోటీన్ లోపం వారి ఎదుగుదలను నిరోధిస్తుంది. పిల్లలు మంచిగా పెరగరు. వారి గ్రోత్ లో మందగమనం కనబడుతుంది. ప్రోటీన్ లోపం ఉంటే నొప్పులు, వాపులు ప్రోటీన్ లోపంతో విపరీతంగా బరువు తగ్గిపోతారు. ప్రోటీన్ శరీరానికి కావలసిన అమైనో ఆమ్లాలను అందిస్తుంది. ప్రోటీన్ మన శరీరంలో ద్రవ సమతుల్యతను కాపాడుతుంది. తగినంత ప్రోటీన్ తీసుకోకపోతే శరీర కణజాలాలలో ద్రవం పెరిగి కాళ్లు, చేతులు, పొట్ట వాపుకు గురవుతాయి. నొప్పులు వస్తాయి. గోళ్ళు విరిగిపోవడం, చర్మం డల్ గా మారడం, జుట్టు ఊడిపోవడం వంటి అనేక సమస్యలు ప్రోటీన్ లోపం వల్లే వస్తాయి.ప్రోటీన్ లోపంతో కండరాలకు నష్టం, మూడ్ స్వింగ్స్ ప్రోటీన్ లోపంతో కండరాల నష్టం జరుగుతుంది. తగినంత ప్రోటీన్స్ శరీరంలో లేకపోతే మూడ్ స్వింగ్స్ వస్తాయి. చిరాకు, బాధ, కోపం వంటి భావోద్వేగాలు కంట్రోల్ కావు. ప్రోటీన్ లోపం ఉంటే చిన్న చిన్న గాయాలు కూడా నయం కావడం ఆలస్యం అవుతుంది. కనుక ప్రోటీన్ లోపం తీవ్రంగా ఉంటే కచ్చితంగా వైద్యున్ని సంప్రదించాలి.




# ఓట్స్ అధికంగా తింటే అనర్థాలు.. జాగ్రత్త!



ఓట్స్... చాలామంది ప్రతిరోజూ ఓట్స్ తింటూ ఉంటారు. ఓట్స్ తో మంచి ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని భావిస్తారు. ఓట్స్ లో విటమిన్ బి2, విటమిన్ సి, పీచు పదార్థం, పిండి పదార్థాలు, మాంసకృత్తులు ఎక్కువగా ఉంటాయి. ఓట్స్ చాలా మంచి పౌష్టికాహారంగా చెప్పవచ్చు. అతిగా ఓట్స్ తింటే అనర్థాలు ఇక ఓట్స్ తింటే ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి అన్నమాట ఎంత వాస్తవమో అతిగా తింటే అనారోగ్యం కూడా వస్తుంది అనే విషయం అంతే వాస్తవం. ఇక ఓట్స్ తినడం వల్ల కలిగే అనారోగ్యాలు, మన శరీరానికి కలిగే నష్టాలు ఏమిటో ప్రస్తుతం తెలుసుకుందాం. ఓట్స్ అతిగా తినడం వల్ల అనేక అనారోగ్యాలు వస్తాయి. అధికంగా ఓట్స్ తిన్న వారిలో కొంతమందికి కడుపు ఉబ్బరం మరియు గ్యాస్ వంటి సమస్యలు వస్తాయి. అధికంగా ఓట్స్ తింటే ఆరోగ్య సమస్యలు ఓట్స్ జీర్ణ సమస్యలకు కారణమవుతుంది. అందుకే ఓట్స్ అధికంగా తినడం మంచిదికాదు. ఓట్స్ లోని ఫైటిక్ యాసిడ్ క్యాల్షియం ,ఇనుము మరియు జింక్ వంటి కొన్ని ఖనిజాల శోషణను నిరోధిస్తుంది. ఓట్స్ అధికంగా తిన్నవారు మలబద్ధకం వంటి సమస్యలతో ఇబ్బంది పడతారు. కొంతమందికి ఓట్స్ లో ఉండే ప్రోటీన్ కారణంగా అలర్జీలు వచ్చే ప్రమాదం ఉంది. ఓట్స్ పదేపదే తింటే ఇన్ఫెక్షన్స్ ఓట్స్ ను సరిగ్గా శుభ్రం చేయకపోతే, అవి తిన్నవారికి బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్స్ వచ్చే ప్రమాదం లేకపోలేదు. పోషకాలు బాగా ఉంటాయని అతిగా ఓట్స్ తినడం వల్ల బరువు పెరిగే ప్రమాదం ఉంటుంది. ఓట్స్ ప్రతిరోజు తీసుకోవడం వల్ల చాలామందిలో కడుపుకు సంబంధించిన సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఓట్స్ ఎక్కువగా తినడం వల్ల వాటిలో క్యాలరీలు తక్కువగా ఉండటం కారణంగా మన శరీరంలో కూడా క్యాలరీల లోపం ఏర్పడే అవకాశం ఉంది. 5 5 మితంగా తింటే ఆరోగ్యం కాబట్టి ఓట్స్ ను తినాలి అని అనుకుంటే ఒక నియమిత పద్ధతిలో తినడం మంచిది. ప్రతిరోజు బ్రేక్ ఫాస్ట్ గా ఓట్స్ మాత్రమే తినడం మంచిది కాదు. ఆరోగ్యానికి మేలు చేకూర్చే ఓట్స్ అధికంగా తింటే కొన్ని దుష్ప్రభావాలు వస్తాయనే విషయాన్ని గుర్తుంచుకొని తదనుగుణంగా మితంగా తింటే మంచిది.


# ఈ లక్షణాలుంటే కిడ్నీలలో రాళ్ళు వెనకేసినట్టే... జాగ్రత్త!



మానవ శరీరంలో మూత్రపిండాలు ముఖ్యమైన అవయవం. ఇవి రక్తాన్ని వడపోసి వ్యర్థాలను మన శరీరం నుండి బయటకు పంపిస్తాయి. శరీరంలో వ్యర్థాలను బయటకు పంపటంలో మూత్రపిండాల పాత్ర కీలకమైనది. అటువంటి మూత్రపిండాలను ఆరోగ్యంగా చూసుకోవలసిన అవసరం ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో చాలామంది మూత్రపిండాలలో రాళ్లు వంటి సమస్యలతో బాధపడుతున్నారు. కిడ్నీలలో రాళ్ళు ఉంటె కనిపించే లక్షణాలు మూత్రపిండాలలో రాళ్లు వస్తే కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. ఎవరికైతే ఈ లక్షణాలు కనిపిస్తాయో వారు మూత్రపిండాల విషయంలో అస్సలు అశ్రద్ధ చేయకూడదు. మూత్రపిండాలలో రాళ్లు ఉంటే నడుము నొప్పి వస్తుంది. పక్కటెముకల కింద నొప్పి లేదా పొత్తి కడుపులో నొప్పి వస్తుంది. ఈ నొప్పి చాలా తీవ్రంగా ఉంటుంది. ఈ నొప్పి తరచుగా ఒక వైపున మాత్రమే వస్తుంది. ఇలా ఉంటె డాక్టర్ దగ్గరకు వెళ్ళాల్సింది పొత్తికడుపు నొప్పి పొత్తికడుపు నుంచి మన తొడల్లోకి, కాళ్ళలోకి కూడా వస్తుంది. ఈ విధంగా నొప్పి వస్తే అసలు నిర్లక్ష్యం చేయకూడదు. కిడ్నీలో రాళ్లు ఉంటే తరచుగా మూత్రం వస్తున్న ఫీలింగ్ కలుగుతుంది. సాధారణం కంటే ఎక్కువగా మూత్ర విసర్జనకు వెళుతున్నట్లయితే కిడ్నీల విషయంలో వైద్యుడి వద్దకు వెళ్ళవలసిందే. ఈ ఇబ్బందులు ఉంటే కిడ్నీలలో రాళ్ళు ఉన్నట్టే కిడ్నీలలో రాళ్లు ఉంటే మూత్ర విసర్జన సమయంలో కూడా నొప్పిగా ఉంటుంది. ఒక్కోసారి మంట అనుభూతి కూడా కలుగుతుంది. సరిగ్గా మూత్ర విసర్జన కాదు. తక్కువ మూత్రవిసర్జన చేసే పరిస్థితి ఉంటుంది. నిర్లక్ష్యం చేయొద్దు. కిడ్నీలో రాళ్లు మూత్రనాళాల ద్వారా బయటకు వెళుతున్నప్పుడు మూత్రంలో రక్తం కనిపించే అవకాశం ఉంటుంది. కిడ్నీలో రాళ్లతో కలిగే నొప్పి కారణంగా అసౌకర్యం కలుగుతుంది. కడుపులో వికారంగా, వాంతులు అయ్యే అవకాశం కూడా ఉంటుంది. నిర్లక్ష్యం చేస్తే సమస్య తీవ్రం ఇక కిడ్నీలో రాళ్లు పట్టించుకోకపోతే అవి ఇన్ఫెక్షన్ కు దారి తీసే అవకాశం ఉంది. చలి జ్వరం వచ్చే పరిస్థితులు కూడా లేకపోలేదు ఇక కిడ్నీలో రాళ్లతో సంబంధం ఉన్న ఇన్ఫెక్షన్ తో మూత్రం చెడు వాసన వస్తుంది. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే అస్సలు నిర్లక్ష్యం చేయకూడదు. వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స తీసుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే సమస్య తీవ్రంగా మారే ప్రమాదం ఉంటుంది.

# రొమ్ము క్యాన్సర్‌ను మనుకా తేనె తగ్గిస్తుందా? పరిశోధనల వాస్తవం ఏంటి?

మనుకా తేనె... ఈ పేరు ఈ మధ్యకాలంలో ఆరోగ్యంపై శ్రద్ధ ఉన్న చాలామందికి సుపరిచితమే. న్యూజిలాండ్‌లో పెరిగే మనుకా బుష్ పువ్వుల నుండి వచ్చే ఈ తేనెను, దాని ప్రత్యేకమైన రుచికి మించి, అనేక ఔషధ గుణాల పుణ్యమా అని 'సూపర్ ఫుడ్'గా భావిస్తున్నారు. సాధారణ తేనెతో పోలిస్తే, మనుకా తేనెలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఎక్కువగా ఉన్నాయని అంటారు. అయితే, ఈ మధ్య కొందరు, మనుకా తేనె క్యాన్సర్ వంటి తీవ్రమైన రోగాలను కూడా నయం చేయగలదని, ముఖ్యంగా రొమ్ము క్యాన్సర్‌ను తగ్గిస్తుందని నమ్ముతున్నారు. సోషల్ మీడియాలో, కొన్ని కథనాలలో ఇలాంటి విషయాలు విస్తృతంగా ప్రచారంలో ఉన్నాయి. మరి ఇందులో నిజమెంత? దీనిపై పరిశోధనలు ఏమి చెబుతున్నాయి?' మనుకా తేనె ప్రత్యేకత ఏమిటి? మనుకా తేనె ప్రత్యేకత ఏమిటంటే, ఇందులో 'మిథైల్‌గ్లైయోక్సాల్' అనే ఒక ప్రత్యేకమైన సమ్మేళనం అధిక మొత్తంలో ఉంటుంది. ఇదే దీనికి బలమైన యాంటీ బ్యాక్టీరియల్ మరియు ఇతర ఆరోగ్య ప్రయోజనాలను చేకూర్చే ప్రధాన కారణం. ఓఊ స్థాయి ఎంత ఎక్కువగా ఉంటే, తేనె అంత శక్తివంతమైనదని భావిస్తారు (దీనిని జఓఈ లేదా ఓఊ రేటింగ్‌లతో కొలుస్తారు). రొమ్ము క్యాన్సర్‌పై పరిశోధనలు ఏం చెబుతున్నాయి? మనుకా తేనె రొమ్ము క్యాన్సర్‌ను మనుషులలో పూర్తిగా నయం చేస్తుందనడానికి లేదా తగ్గిస్తుందనడానికి ఇప్పటివరకు ఎటువంటి ఖచ్చితమైన, పెద్ద ఎత్తున జరిగిన మానవ క్లినికల్ ట్రయల్స్ (పరిశోధనలు) లేవు. ఇది చాలా ముఖ్యమైన విషయం. అయితే, ప్రయోగశాలల్లో మరియు కొన్ని జంతువులపై (తిని లతిలనీ) కొన్ని ప్రాథమిక పరిశోధనలు జరిగాయి. ఈ పరిశోధనలలో లభించిన కొన్ని ఆధారాలు ఉన్నాయి: క్యాన్సర్ కణాల పెరుగుదలను అడ్డుకోవడం: మనుకా తేనెలోని కొన్ని సమ్మేళనాలు, ముఖ్యంగా ఓఊ, వివిధ రకాల క్యాన్సర్ కణాల (రొమ్ము క్యాన్సర్ కణాలు కూడా) పెరుగుదలను ప్రయోగశాల పరిస్థితులలో అడ్డుకోవడానికి లేదా నెమ్మదింపజేయడానికి సహాయపడతాయని కొన్ని అధ్యయనాలు చూపించాయి. మనుకా తేనె, క్యాన్సర్ కణాలలో సహజ సిద్ధంగా జరిగే కణ మరణం (ంజూనీజూబినీబతిబ) ప్రక్రియను ప్రేరేపించగలదని కొన్ని పరిశోధనలు సూచిస్తున్నాయి. అంటే, క్యాన్సర్ కణాలు తమంతట తామే నశించిపోవడానికి ఇది సహాయపడవచ్చు. వ్యాప్తిని నిరోధించడం: క్యాన్సర్ కణాలు ఒక చోటు నుండి మరో చోటుకు వ్యాప్తి చెందడాన్ని (మెటాస్టాసిస్) మనుకా తేనెలోని కొన్ని అంశాలు అడ్డుకోగలవని ప్రాథమిక ఆధారాలున్నాయి. దీనిలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ , యాంటీ ఆక్సిడెంట్ గుణాలు శరీరంలోని మంటను తగ్గించి, కణాలను దెబ్బతినకుండా కాపాడతాయి. ఇది పరోక్షంగా క్యాన్సర్ నివారణకు లేదా దానితో పోరాడటానికి సహాయపడవచ్చు, కానీ ఇది ప్రత్యక్షంగా క్యాన్సర్‌ను నయం చేస్తుందని కాదు. గుర్తుంచుకోవాల్సిన ప్రధాన విషయం: అయితే ఈ పరిశోధనలన్నీ కేవలం ప్రారంభ దశలోనే ఉన్నాయి. అవి ప్రధానంగా ప్రయోగశాల పరిస్థితులలో లేదా జంతువులపై జరిగాయి. ప్రయోగశాల ఫలితాలు మనుషులలోనూ అదేవిధంగా పనిచేస్తాయని ఖచ్చితంగా చెప్పలేము. మానవ శరీరం చాలా సంక్లిష్టమైనది. మనం ఆహారంగా తీసుకునే మనుకా తేనె, శరీరంలోకి వెళ్ళిన తర్వాత ఎలా మారుతుంది, అది క్యాన్సర్ కణాల వద్దకు ఏ స్థాయిలో చేరుకుంటుంది, అక్కడ అది ఎలా పనిచేస్తుంది అనే దానిపై ఇంకా చాలా పరిశోధన జరగాల్సి ఉంది. "పాకిస్థాన్ కు రూ.7,500 కోట్లు సాయం చేసిన ఎఓఈ.. భారత్ సంచలన నిర్ణయం" ఈ మనుకా తేనెలో క్యాన్సర్ వ్యతిరేక లక్షణాలు ఉండవచ్చని ప్రాథమిక పరిశోధనలు ఆశాజనకంగా సూచిస్తున్నాయి. కానీ, మనుషులలో రొమ్ము క్యాన్సర్‌ను సమర్థవంతంగా తగ్గిస్తుందనడానికి లేదా నయం చేస్తుందనడానికి ప్రస్తుతం బలమైన, శాస్త్రీయ ఆధారాలు లేవు. దీనిపై మరింత లోతైన, పెద్ద ఎత్తున మానవ పరిశోధనలు అవసరం. కాబట్టి, మనుకా తేనెను 'రొమ్ము క్యాన్సర్ నివారణ'గా భావించడం సరికాదు. ఇది సాంప్రదాయ వైద్య చికిత్సలకు (కీమోథెరపీ, రేడియేషన్, సర్జరీ) ప్రత్యామ్నాయం కాదు. క్యాన్సర్ చికిత్స విషయంలో ఎప్పుడూ వైద్య నిపుణుడిని సంప్రదించి, వారి సలహా మేరకే ముందుకు వెళ్లాలి. మనుకా తేనెను కేవలం ఒక సాధారణ ఆరోగ్య సప్లిమెంట్‌గా లేదా ఆహారంలో భాగంగా తీసుకోవాలని అనుకున్నా, ముందుగా డాక్టర్‌తో చర్చించడం ఉత్తమం.




# హీరోని మెప్పించిన ఫ్యాన్స్





గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ రీసెంట్ గా మరో అరుదైన రికార్డు క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. లండన్ లోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో చరణ్ మైనపు విగ్రహాన్ని ఈ నెల 9వ తేదీన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చరణ్ లండన్ వెళ్లి అక్కడ విగ్రహావిష్కరణలో పాల్గొన్నాడు. చరణ్ తో పాటూ అతను ఎంతో ఇష్టంగా పెంచుకునే కుక్కపిల్ల బొమ్మను కూడా మేడమ్ టుస్సాడ్స్ లో తయారుచేసి ఉంచారు. విగ్రహ ఆవిష్కరణ తర్వాత రైమ్ తో కలిసి ఫోటోలకు పోజులిచ్చిన చరణ్ అక్కడి ఫ్యాన్స్ ను కలిసి వారితో కాసేపు ముచ్చటించారు. చరణ్ అభిమానులే కాకుండా పవన్ కళ్యాణ్ అభిమానులు కూడా కొంతమంది చరణ్ ను కలిశారు. యూకే లోని జనసేన మరియు రామ్ చరణ్ ఫ్యాన్స్ హీరో చరణ్ ను కలవడమే కాకుండా భారత రక్షణ నిధికి విరాళం కూడా అందచేశారు. విరాళాన్ని అందుకున్న రామ్ చరణ్, తన అభిమానులకు కృతజ్ఞతలు చెప్పి, వారు చేసిన మంచి పనికి అందరినీ పేరుపేరునా అభినందించాడు. ప్రస్తుతం దానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో దేశంలో ఎలాంటి పరిస్థితులు నెలకొన్నాయనేది అందరికీ తెలుసు. భారత్-పాక్ సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో ఇప్పటికే పలువురు సెలబ్రిటీలు భారత సైనిక దళాలకు మద్దతుని ప్రకటించారు. ఇప్పుడు చరణ్ ఫ్యాన్స్ కూడా తమ మద్దతుని తెలుపుతూ కొంత డబ్బుని ఇండియన్ ఆర్మీకి విరాళంగా అందించారు. ఇక చరణ్ కెరీర్ విషయానికొస్తే ప్రస్తుతం అతను బుచ్చిబాబు సాన దర్శకత్వంలో పెద్ది సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే.



# చిక్కుల్లో 'డ్యూడ్'.. మైత్రీకి కొత్త తలనొప్పి!

: కొద్ది రోజుల క్రితం ప్రముఖ తెలుగు నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ప్రదీప్ రంగనాథ్ తో ఓ సినిమాని అనౌన్స్ చేసింది. తాజాగా ఈ సినిమాకు 'డ్యూడ్' అనే టైటిల్ ను కన్ఫార్మ్ చేస్తూ పోస్టర్ విడుదల చేశారు. దీపావళి కానుకగా మూవీని రిలీజ్ చేస్తామని కూడా తెలిపారు. రొమాంటిక్ ఎంటర్టైనర్ గా రూపొందుతున్న ఈ చిత్రానికి కీర్తిశ్వరన్ డైరెక్టర్ కాగా.. 'ప్రేమలు' ఫేమ్ మమిత బైజు హీరోయిన్ గా ఎంపిక అయింది. సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నాడు. అంతా బాగానే జరుగుతున్న సమయంలో డ్యూడ్ టైటిల్ చిక్కుల్లో పడింది. దాంతో మైత్రీకి కొత్త తలనొప్పి మొదలైంది. మైత్రి మూవీ మేకర్స్ వారు టైటిల్ ప్రకటన చేసిన వెంటనే.. డ్యూడ్ టైటిల్ తమదంటూ యువ హీరో-డైరెక్టర్-ప్రొడ్యూసర్ తేజ్ తెరపైకి వచ్చాడు. ఏడాది క్రితమే 'డ్యూడ్' టైటిల్ ను తమ సినిమా కోసం రిజిస్టర్ చేశామని.. అదే టైటిల్ తో సినిమాను ప్రచారం కూడా చేస్తున్నామని తేజ్ తెలిపాడు. ఇప్పుడు ఆ పేరునే మైత్రి వారు అనౌన్స్ చేయడం ఆశ్చర్యంగా, ఆవేదనగా ఉ



ఒందన్నాడు తేజ్. అయితే మైత్రి వంటి బడా నిర్మాణ సంస్థతో ఘర్షన పడే ఉద్దేశం తనకు ఏమాత్రం లేదని.. ఆల్రెడీ ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లానని, సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నామని తేజ్ పేర్కొన్నాడు.తేజ్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న చిత్రమే 'డ్యూడ్'. స్క్రీన్ ప్లే కూడా అతనే అందిస్తున్నాడు. ఫూట్ బాల్ నేపథ్య కథతో రూపుదిద్దుకుంటున్న చిత్రమిది. రంగాయన రఘు ఇందులో ఫుట్ బాల్ కోచ్ గా కనిపించబోతున్నారు. రాఘవేంద్ర రాజ్ కుమార్, శాన్య కావేరమ్మ, మేఘ, మోహిత, అనర్ఘ్య, దీపాలి పాండే తదితరులు ఇతర ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నారు. ఇప్పటికే సినిమాకు సంబంధించి కొన్ని పోస్టర్స్ బయటకు వచ్చాయి. చిత్రీకరణ దాదాపు ఆఖరి దశకు చేరుకుంది. లాస్ట్ షెడ్యూల్ ఒక్కటే బ్యాలెన్స్. ఆగస్టు లేదా సెప్టెంబర్ లో ఈ చిత్రాన్ని తెలుగులోనే కాకుండా కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేయాలని డ్యూడ్ మేకర్స్ భావిస్తున్నారు. అయితే ఇంతలోనే ప్రదీప్ రంగనాథ్ తో తీయబోయే చిత్రానికి మైత్రి మూవీ మేకర్స్ వారు డ్యూడ్ టైటిల్ కన్ఫార్మ్ చేస్తూ పోస్టర్ ను రిలీజ్ చేశారు. దాంతో ఒరిజినల్ డ్యూడ్ వారు ఉలిక్కి పడ్డారు. టైటిల్ తమదంటూ ముందుకు వచ్చారు. మరి ఈ ఇష్యూపై మైత్రీ వారు ఎలా రియాక్ట్ అవుతారో.. ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో.. చూడాలి.

# నెట్టింట శేష్ పోస్ట్ వైరల్.. ఏమంటున్నాడంటే



: నేచురల్ స్టార్ నాని హీరోగా ఉంటూ నిర్మించిన సినిమా హిట్3. మే 1న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా మిక్స్ టాక్ తో బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తుంది. ఇప్పటికే హిట్3 సినిమా దాదాపు అన్ని ఏరియాల్లో రికవరీ అయినట్టు సమాచారం. ఆల్మోస్ట్ అందరూ సేఫ్ అయి, లాభాల బాట పట్టినట్టు ట్రేడ్ వర్గాలు చెప్తున్నాయి. శైలేష్ కొలను దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో హిట్2 హీరో అడివి శేష్ కీలక పాత్రలో నటించిన విషయం తెలిసిందే. కేడీ పాత్రలో హిట్2 సినిమాలో అలరించిన అడివి శేష్, హిట్3 సినిమాలో నాని ఆపదలో ఉన్నప్పుడు అతనే వచ్చి కాపాడతాడు. హిట్3 లో శేష్ క్యామియో చాలా సింపుల్ గా ఉంటూనే ఇంప్రెస్సివ్ గా ఉంది. ఇదిలా ఉంటే సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే అడివి శేష్ తాజాగా ఎక్స్ లో ఓ ఇంట్రెస్టింగ్ పోస్ట్ చేశాడు. ఆ పోస్ట్ లో తన కోస్టార్ నాని తో ఉన్న ఫోటోను షేర్ చేస్తూ, బ్రదర్ ఫ్రమ్ అనదర్ మదర్ అని రాసుకొచ్చాడు. వీరిద్దరూ కలిసి హాస్పిటల్ లో ఉన్నప్పుడు ఆ ఫోటోను తీసినట్టు అర్థమవుతుంది. ఆ ఫోటోను హిట్3 హీరోయిన్ శ్రీనిధి శెట్టి తీసినట్టు కూడా శేష్ తన పోస్ట్ లో పేర్కొన్నాడు. ప్రస్తుతం శేష్ ఎక్స్ లో చేసిన పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఇక శేష్ కెరీర్ విషయానికొస్తే, ప్రస్తుతం గూఢచారి2, డెకాయిట్ సినిమాల్లో నటిస్తున్నాడు. ఈ రెండు సినిమాలపై శేష్ చాలానే ఆశలు పెట్టుకున్నాడు. కెరీర్ స్టార్టింగ్ నుంచి కంటెంట్ బేస్డ్ సినిమాలకే ప్రాధాన్యతనిస్తూ వస్తున్న శేష్ ఈ సినిమాలతో ఎలాంటి ఫలితాన్ని అందుకుంటాడో చూడాలి.

# 2025 ఫస్టాఫ్ లోని బెస్ట్ ఫిల్మ్స్ ఇవే..

నిన్న కాక మొన్న కొత్త సంవత్సరంలోకి ఎంటరైనట్టు ఉంది. కానీ అప్పుడే 2025 సగం అయిపోయింది. ఇండియన్ సినీ పరిశ్రమలు ఆల్రెడీ ఒకదాని తర్వాత మరొకటి బ్లాక్ బస్టర్లు అందించడానికి పోటీ పడుతుండగా, ఈ ఇయర్ ఇప్పటికే పలు సినిమాలు రిలీజయ్యాయి. అందులో కొన్ని క్రైమ్ థ్రిల్లర్లు, మరికొన్ని మర్డర్ మిస్టరీలు, ఇంకొన్ని కోర్టు రూమ్ డ్రామాలున్నాయి. 2025లో రిలీజై ఆడియన్స్ ను మెప్పించిన కొన్ని సర్ప్రైజింగ్ సినిమాల్లో టాప్ 5 సినిమాలేంటో చూద్దాం. ? అందులో మొదటిగా అక్షయ్ కుమార్ నటించిన బాలీవుడ్ మూవీ కేసరి2 ఫస్ట్ ప్లేస్ లో ఉంది. దేశభక్తి ప్రధానమైన ఈ కోర్టు రూమ్ డ్రామా వరల్డ్ వైడ్ గా రూ.129.14 కోట్లు కలెక్ట్ చేసి ఆడియన్స్ ను విపరీతంగా ఆకట్టుకుంది. ఇండియన్ హిస్టరీ మరియు ఎమోషన్స్ ను కలగలిపి తెరకెక్కించిన ఈ సినిమా ఆడియన్స్ ను విపరీతంగా అలరించింది. టాలీవుడ్నుంచి వచ్చిన కోర్టు: స్టేట్ వర్సెస్ ఎ నోబడీ. నేచురల్ స్టార్ నాని నిర్మాతగా ప్రియదర్శి ప్రధాన పాత్రలో తెరకెక్కిన ఈ కోర్టు రూమ్ డ్రామా ఆడియన్స్ ను విపరీతంగా మెప్పించింది. అంతేకాదు తక్కువ బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ.58.15 కోట్లు కలెక్ట్ చేసి నిర్మాతకు, డిస్ట్రిబ్యూటర్లకు మంచి లాభాల్ని మిగిల్చింది. కోలీవుడ్ నుంచి వచ్చిన టూరిస్ట్ ఫ్యామిలీ సినిమా కూడా ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ అందుకుంది. కొత్త జీవితాన్ని ఏర్పాటు చేసుకోవడానికి ప్రయత్నించే వలస కుటుంబం యొక్క కథగా ఈ సినిమా రూపొందింది. ఫన్నీ ఫ్యామిలీ డ్రామాగా శశి కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా రూ.25 కోట్లు కలెక్ట్ చేసి మంచి హిట్ గా నిలిచింది. ఎంచి రీసెంట్ గా వచ్చిన తుదరమ్ సినిమా కూడా ఎమోషనల్ రోలర్ కోస్టర్ గా తెరకెక్కి ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ ను తెచ్చుకుంది. మోహన్ లాల్ హీరోగా వచ్చిన ఈ సినిమా రూ.175 కోట్లు కలెక్ట్ చేసి సూపర్ హిట్ గా నిలిచింది



# స్పై థ్రిల్లర్ సీక్వెల్ మొత్తం చిలీలోనేనా!

యశ్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్ నుంచి రిలీజ్ అయిన 'పఠాన్' ఎలాంటి విజయం సాధించిందో తెలిసిందే. షారుక్ ఖాన్ కథానాయకుడిగా సిద్దార్థ్ ఆనంద్ తెరకెక్కించిన సినిమా వసూళ్లతో భాక్సాఫీస్ ని షేక్ చేసింది. 1000 కోట్ల వసూళ్లతో షారుక్ కెరీర్ లో మరో మైలు రాయిగా నిలిచింది. యాక్షన్ థ్రిల్లర్ చిత్రాల కు కొత్త మీనింగ్ తీసుకొచ్చింది. అప్పటికే సరైన సక్సెస్ లు లేక విలవిలాడుతోన్న బాలీవుడ్ ని మళ్లీ పైకి లేపిన చిత్రమిదే. తాజాగా 'పఠాన్ 2'కి సన్నాహాలు మొదలయ్యాయి. ఈ చిత్రాన్ని యశ్ రాజ్ ఫిలింస్ మరింత ప్రతిష్టా త్మకంగా భావిస్తోంది. 'పఠాన్' ను మించి రెండవ భాగం పీక్స్ లో ఉండాలని ప్లాన్ చేస్తుంది. దీనిలో భాగంగా షూటింగ్ అంతా చిలిలోనే ప్లాన్ చేస్తున్నారుట. ప్రస్తుతం అనుమతుల కోసం అక్కడ ప్రభు త్వంతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ కథ అక్కడ లోకేషన్లు డిమాండ్ చేయడంతో యశ్ రాజ్ ఫిలింస్ ఏమాత్రం రాజీ పడకుండా మేకర్స్ కు పూర్తి సహకారం అందిస్తున్నారు. అనుమతులు లభించగానే నటీనటుల బిజీ షెడ్యూల్స్ ను బట్టి చిత్రీకరణకు వెళ్లేలా ప్లాన్ చేసుకుం టున్నారు. ప్రస్తుతం షారుక్ ఖాన్ కూడా కొత్త చిత్రాలేవి కమిట్ అవ్వలేదు. 'డంకీ' రిలీజ్ తర్వాత షారుక్ కొత్త సినిమా రిలీజ్ అవ్వలేదు. గత ఏడాదంతా ఖాళీగానే ఉన్నారు. కుమార్తె సుహానాఖాన్ నటిస్తోన్న 'కింగ్' చిత్రంలో మాత్రం కీలక పాత్ర పోషిస్తున్నారు. కేవలం కుమార్తె కోసం మాత్రమే నటిస్తోన్న చిత్రమిది. దీంతో షారుక్ కొత్త సినిమా ప్రకటన ఎప్పుడని అభిమానులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో 'పఠాన్' సీక్వెల్ తోనే షారుక్ వస్తే అంతకు మించిన సంతోషం ఉండదు. ఓ భారీ హిట్ అందు కున్నా? ఫ్లాప్ అందుకున్నా షారుక్ కొత్త సినిమా మొదలు పెట్టడానికి సమయం తీసుకుంటారు.



# అప్పుడు సింగిల్ గా.. ఇప్పుడు పిల్లలతో.. 90స్ కిడ్స్ మూవీ టైమ్!

అప్పుడు తొలిసారి రిలీజ్ అయినప్పుడు సింగిల్ గా థియేటర్స్ కు వెళ్లారు సినీ ప్రియులు. కానీ ఇప్పుడు రీ రిలీజ్ అయినప్పుడు తమ కుటుంబాలు.. ముఖ్యంగా పిల్లలతో థియేటర్స్ కు వెళ్తున్నారు. ఈ అరుదైన సందర్భానికి వేదిక జగదేకవీరుడు అతిలోకసుందరి రీ రిలీజ్. 35 సంవత్సరాల తర్వాత ఆ మూవీ మళ్లీ విడుదలైన విషయం తెలిసిందే. మెగాస్టార్ చిరంజీవి హీరోగా.. స్టార్ నటి శ్రీదేవి హీరోయిన్ గా.. దర్శకుడు రాఘవేంద్రరావు తెరకెక్కించిన ఆ సినిమాను వైజయంతీ మూవీస్ బ్యానర్ పై అశ్వనీదత్ అప్పట్లో తెరకెక్కించారు. చక్కటి సోషియో ఫాంటసీ కథతో భారీ విజువల్ వండర్ లా ముస్తాబైన ఆ సినిమా.. 1990లో సమ్మర్ స్పెషల్ గా మే 9వ తేదీన విడుదలైంది.బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న ఆ మూవీ.. ఇప్పుడు మే9వ తేదీన రీ రిలీజైంది. 2డీతో పాటు 3డీ వెర్షన్‌లో విడుదల చేశారు మేకర్స్. అప్పటి క్లాసిక్ చిత్రం.. త్రీడీ సొబగులద్దుకుని సినీ ప్రియులను ఆకట్టుకుంటుందనే చెప్పాలి. అన్ని వర్గాల ఆడియన్స్ ను థియేటర్స్ ను రప్పిస్తుంది. మంచి వసూళ్లను కూడా రాబడుతోంది. అయితే ఒకప్పుడు పిల్లలుగా సినిమా చూసిన సినీ ప్రియులు, అభిమానులు.. ఇప్పుడు తమ పిల్లలతో థియేటర్స్ కు వస్తున్నారు. 3డీ వెర్షన్ లో మూవీని తమ పిల్లలకు చూపిస్తూ.. తాము కూడా చూపిస్తూ సందడి చేస్తున్నారు. దీంతో సినిమా రీ రిలీజ్ అయిన అన్ని థియేటర్స్ కళకళలాడుతున్నాయి. ఫ్యామిలీసే ఎక్కువగా వెళ్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అబ్బనీ తీయని దెబ్బ వంటి పాటల సమయంలో ఆడియన్స్ ఓ రేంజ్ లో సందడి చేస్తున్నారు. స్పెషల్ డ్రెస్సులు.. స్టెప్పులు.. కేరింతలతో హోరెత్తిస్తున్నారు. అందుకు సంబంధించిన విజువల్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. 90స్ క్లాసిక్ మూవీ మరోసారి త్రీడీలో చూడడం చాలా ఆనందంగా ఉందని అంతా చెబుతున్నారు. అయితే కొంత మంది ప్రేక్షకులు ప్రింట్ నాణ్యత గురించి ఇచ్చిన చిన్న ఫిర్యాదులను గమనించినప్పటికీ.. ఓవరాల్ గా రీ రిలీజ్ ట్రెండ్ లో జగదేకవీరుడు అతిలోకసుందరి మాత్రం ల్యాండ్ మార్క్ గా నిలిచిందనే చెప్పాలి.



Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal, RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**